

ఉత్తర గోపురంలో భక్తులకు దర్శనమిస్తున్న కదిరి లక్ష్మీ నరసింహ స్వామి






కసాపురంలో ప్రత్యేక అలంకరణలో సీతారామచంద్ర మూర్తులు


తాడిపత్రి వీధుల్లో విహరిస్తున్న చింతల వెంకటరమణస్వామి


రామ్‌నగర్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి వనవిహారోత్సవం

రామ్‌నగర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో దర్శనమిస్తున్న శ్రీనివాసుడు


ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తరద్వారంలో ప్రవేశిస్తున్న భక్తులు

ఏడుకొండలవాడా వెంకటరమణా.. గోవిందా.. గోవింద


స్వామివారి చిత్రాలను సెల్‌లో బంధిస్తూ..


పాతూరు చెన్నకేశవ స్వామి ఆలయంలో పూజలందుకుంటున్న స్వామివారు


ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణ

ఇల వైకుంఠపురములో...

జిల్లాలో ప్రతిధ్వనించిన హరినామ స్మరణ

అనంతపురం కల్చరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లా వైకుంఠపురముగా మారింది. వైష్ణవాలయాలు హరినామ స్మరణతో ప్రతిధ్వనించాయి. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లాలోని వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు పోటెత్తారు. ఉదయం నుంచి రాత్రి వరకూ వేలాదిగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కొన్ని ఆలయాల్లో స్వామివారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉంచే పురవీధుల్లో ఊరేగించారు. ఎక్కడా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు.

సర్వే సంకటం!

జిల్లాలో నత్తనడకన ఎంఎస్ఎంఈ సర్వే

- నవంబరులో ప్రారంభమైన ప్రక్రియ
- ఇప్పటిదాకా 31.47 శాతమే పూర్తి
- వివరాలు ఇచ్చేందుకు వ్యాపారుల సంకోచం
- అవగాహన కల్పించడంలో అధికారుల అశ్రద్ధ

అనంతపురం అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమల సర్వే సంకటంగా మారింది. సర్వేలో నమోదు చేసే వివరాల ఆధారంగా వ్యాపారులు ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందే అవకాశం ఉంది. అందుకే వ్యాపారులందరికీ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వం నిబంధన విధించింది. ఈ నేపథ్యంలో గత ఏడాది నవంబరు ఆఖరివారంలో ఎంఎస్ఎంఈ సర్వేతోపాటు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ నెలాఖరులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది అందరూ ఆయా పరిధిల్లో ఎంఎస్ఎంఈ యాప్‌లో వ్యాపారుల వివరాలను నమోదు చేయడంతోపాటు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేయించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు జిల్లా యంత్రాంగం సంబంధిత అధికారులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి నిర్దేశించిన సమయంలోగా సర్వే పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్వే ఆరంభించిన నెల రోజులు దాటినా సర్వే ప్రక్రియ ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడటమే ఇందుకు కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి.


జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయం

సర్వే ప్రయోజనాలివీ..!

సర్వేలో నమోదు చేసిన సంస్థల్లో అవసరమైన వాటికి స్టాండప్ ఇండియా, ఇతర పరిశ్రమల పథకాల ద్వారా ఆర్థిక సాయం అందిస్తారు. సంస్థలకు మార్కెటింగ్ సహాయం అందించేందుకు, ఆలస్యమైన ఆర్థిక చెల్లింపుల సమస్యలు పరిష్కరిస్తారు. అవసరమైన సంస్థలకు జెడ్‌ఈడీ, ఐఎస్ఓ, 9000, ఐఎస్ఐ తదితర నాణ్యమైన ధ్రువ పత్రాలు పొందడంలో సహాయం అందిస్తారు. అర్హత కలిగిన యూనిట్లకు పారిశ్రామిక వాడలు, ఎంఎస్ఎంఈ పార్కులు, ప్లాటెడ్ కాంప్లెక్స్‌ల్లో ప్లాట్లు కేటాయించే అవకాశం ఉంది. ఆర్థిక వ్యవస్థను అర్థం చేసుకొని ప్రభుత్వ పథకాలను రూపొందించడానికి ఈ సర్వే ఉపయోగపడుతుంది.

అందజేయాల్సిన వివరాలు..

సర్వే కోసం తప్పని సరిగా ఆధార్ కార్డు సమర్పించాలి. ఆయా రకాల యూనిట్ల ఆధారంగా అదనపు పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. పాన్ కార్డు, బ్యాంక్ ఖాతా, గత నెల విద్యుత్ బిల్లు, జీఎస్‌టీ, ట్రేడ్ లైసెన్స్, ఫ్యాక్టరీ లైసెన్స్, ఐటీ రిటర్న్స్, ఇ మొయిల్ ఐడీ, లేబర్ రిజిస్ట్రేషన్ కాపీ, ఉద్యమ్ సర్టిఫికెట్ లేదా ఉద్యమ్ రిజిస్ట్రేషన్ నెంబర్‌లను సమర్పించాల్సి ఉంటుంది. ఈ సర్వేలో యూనిట్ పేరు, ప్రమోటర్ వివరాలు, పెట్టుబడి, టర్నోవర్ వివరాలు, ఉద్యమ్ నమోదు కోసం సమ్మతి (ఉద్యమ్ సర్టిఫికెట్), అనుమతులు లేదా లైసెన్స్ పవర్ కనెక్షన్ వివరాలు, బ్యాంక్ రుణాల వివరాలు, ప్రస్తుత ఉన్న కార్మికుల సంఖ్య, అవసరమైన కార్మికుల సంఖ్య, మార్కెట్ వివరాలు సమర్పించాలి.

ఏయే వ్యాపార వర్గాలు ఎంఎస్ఎంఈ కిందకు వస్తాయంటే..!

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్థాపించిన అన్ని రకాల సాధారణ వ్యాపార సంస్థలు ఎంఎస్ఎంఈ యూనిట్లను సర్వేలో నమోదు చేయాలని నిర్ణయించారు. సర్వేలో భాగంగా వివిధ రకాలైన వ్యాపార కార్యకలాపాలు, సేవా కార్యకలాపాలు, తయారీ కార్యకలాపాలను నమోదు చేయాలని నిర్ణయించారు. వ్యాపార కార్యకలాపాల్లో భాగంగా కిరాణా దుకాణాలు, ఫ్యాన్సీ దుకాణాలు, చికెన్, మటన్ సెంటర్లు, కూల్ డ్రింక్స్ పండ్లు, పాల ఉత్పత్తుల దుకాణాలు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, బుక్‌స్టాల్, కూరగాయలు, సిమెంట్, స్టీల్ తదితర దుకాణాలను నమోదు చేస్తారు.



● సేవా కార్యకలాపాల్లో భాగంగా.... మొబైల్, టీవీ రిపేరింగ్, జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్, మోటారు సైకిల్ రిపేరి షాపులు, పంచర్ షాపులు, మోటారు రివైండింగ్, వెల్డింగ్ వర్క్‌లు, షీట్ సెట్టింగ్, ఫంక్షన్ హాల్స్, టెంట్ హౌస్‌లు, హోటళ్లు, క్యాటరర్లు, వుడ్ ప్లెయినింగ్ వర్క్‌లు, స్టిక్కరింగ్, వీడియో, ఆడియో గేమ్‌ల దుకాణాలు, ఫొటో స్టూడియోలు, పిండి మరలు, వెట్ గ్రైండింగ్ (దోశ, మసాలా గ్రైండింట్ తదితర), డిష్ నెట్ వర్క్‌లు, టైలర్ షాపులు, బ్యూటీ పార్లర్లు, బార్బర్ షాపులు, ఆస్పత్రులు, ఎలక్ట్రిక్ వర్క్స్‌లు, గృహోపకరణ మరమ్మతుల దుకాణం, ప్రింటింగ్, ఆఫ్ సెట్, ట్రావెల్ ఆఫీస్‌లు, పౌల్ట్రీ ఫారమ్‌లు, డైరీ ఫారమ్ తదితర వాటిని నమోదు చేస్తారు.

● తయారీ కార్యకలాపాల్లో భాగంగా.... సిమెంట్ ఇటుకల తయారీ, ఎర్ర ఇటుకల తయారీ, మినరల్ వాటర్, ఫర్నిచర్, పేపర్ ప్లేట్లు, కప్పులు తయారీ, రైస్, ఆయిల్ మిల్లులు, స్టోన్ క్రషర్లు, అన్ని ప్లాస్టిక్ సంబంధిత పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, వేరుశనగ డికార్టికేటర్లు, గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ యూనిట్లు, హ్యాండ్ లూమ్స్, పవర్ లూమ్స్, రెడీమేడ్ దుస్తుల తయారీ, ఆటో మొబైల్ పరికాలు, ఐస్ క్రీమ్ తయారీ తదితర వాటిని నమోదు చేస్తారు.

28,164 యూనిట్ల సర్వేతో సరిపెట్టిన వైనం

జిల్లా వ్యాప్తంగా 89,503 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా యూనిట్లను సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటి దాకా 28,164 యూనిట్లను (31.47 శాతం) మాత్రమే చేశారు. పలు ప్రాంతాల్లో సచివాలయ సిబ్బంది సర్వే చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో వ్యాపారులు తగిన సమాచారం ఇవ్వడం లేదని తెలిసింది. ఆధార్, పాన్, జీఎస్టీ, టర్నోవర్ ఇతర వివరాలు అడుగుతుండటంతో ఈ వివరాలు ఇస్తే ఏమవుతుందోనన్న అనుమానంతో వ్యాపారులు జంకుతున్నట్లు తెలిసింది. సర్వే వల్ల కలిగే ప్రయోజనాలపై క్షేత్ర స్థాయిలో వ్యాపారులకు తెలియ జేయడంలో సంబంధిత అధికారులు అశ్రద్ధ వహించడం వల్లే ఈ పరిస్థితి నెలకొందన్న వాదనలు వినిపిస్తున్నాయి. గుంతకల్లు మున్సిపాలిటీ పరిధిలో 7660 యూనిట్ల వివరాలు నమోదు చేయాల్సి ఉండగా ఇప్పటి దాకా 724 యూనిట్ల వివరాలు (9.45 శాతం) మాత్రమే యాప్‌లో నమోదు చేశారు. అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలో 31006 యూనిట్లకు 4141(13.36 శాతం), కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలో 3123 యూనిట్లకు 785 (25.14 శాతం), గుత్తి మున్సిపాలిటీ పరిధిలో 2666 యూనిట్లకు 740 (27.76 శాతం) యూనిట్లపై సర్వే చేశారు. రాయదుర్గం మున్సిపాలిటీలో 4043 యూనిట్లకు 1831 (45.29 శాతం), తాడిపత్రి మున్సిపాలిటీలో 7695 యూనిట్లకు 4351 (56.54 శాతం), కుందుర్పి మండలంలో 804 యూనిట్లకు 785 యూనిట్లపై (97.64 శాతం)సర్వే పూర్తి చేశారు. కళ్యాణదుర్గం, పుట్లూరు, ఆత్మకూరు, బ్రహ్మసముద్రం, గుమ్మఘట్ట, వజ్రకరూరు, రాయదుర్గం, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, పామిడి, విడపనకల్లు మండలాల్లో 51 శాతం నుంచి 91.81 శాతం వరకు సర్వే పూర్తి చేశారు. మిగిలిన మండలాల్లో 20.38 శాతం నుంచి 45 శాతం లోపే సర్వే జరిగింది.



అపోహాలొద్దు



ఎంఎస్ఎంఈ సర్వేపై వ్యాపారులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దు. సర్వే కోసం వచ్చిన సచివాలయ సిబ్బందికి తగిన ధ్రువీకరణ పత్రాలు అందజేసి సర్వేకు సహకరించాలి. అలాగే ఉద్యమ్ రిజిస్ట్రేషన్ కూడా చేయించుకోవాలి. వ్యాపారవేత్తలకు అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకే ప్రభుత్వం ఈ సర్వే చేయిస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని సర్వేకు వ్యాపారులంతా సహకరించాలి. జనవరి నెలాఖరులోగా అన్ని ప్రాంతాల్లో సర్వే పూర్తి చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆదేశాలు జారీ చేశాం. ప్రతి రోజు జిల్లా ఉన్నతాధికారులు వీసీ ద్వారా సర్వేపై ఆరా తీసి సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నారు. నిర్దేశించిన సమయంలోగా జిల్లాలో సర్వే పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

-శ్రీధర్, పరిశ్రమల శాఖ జిల్లా అధికారి

మరో ఎంఎస్ఎంఈ పార్కు
ఏర్పాటుకు చర్యలు: కలెక్టర్


గొందిరెడ్డిపల్లి వద్ద రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

రాప్తాడు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ పరిధిలోని 100 ఎకరాల్లో అదనంగా ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. మండలంలోని గొందిరెడ్డిపల్లి సమీపాన ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు కోసం అవసరమైన స్థలాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అదనంగా ఏర్పాటు చేసే పార్కులో రోడ్లు, విద్యుత్, మురుగు కాలువలు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. ఇక్కడి గ్రౌండ్ వాటర్ పరిస్థితి, అందుబాటులో ఉన్న స్థలం తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ మేనేజర్ సాగర్, తహసీల్దార్ విజయకుమారి, సర్వేయర్ రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

347 గోకులం షెడ్లు ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగలో భాగంగా ఒకే రోజు 347 గోకులం షెడ్లు ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశువుల పాక-గోకులం షెడ్లు 700మంజూరు చేయగా శుక్రవారం 347 షెడ్లను ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఒక్కో గోకులం షెడ్ రూ.2.30లక్షల వ్యయంతో నిర్మించినట్లు డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు. గుత్తి మండలం బసినేపల్లిలో డ్వామా పీడీ సలీంబాషా గోకులంషెడ్డు ప్రారంభించారు. జాబ్‌కార్డు కలిగిన ఉపాధి హామీ కూలీలకు గోకులంషెడ్లు పల్లె పండుగలో భాగంగా నిర్మిస్తున్నామని తెలిపారు. శుక్రవారం 347 ప్రారంభించామని, మరో 353 త్వరలో అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు.


గుత్తి మండలం బసినేపల్లిలో గోకులంషెడ్డును ప్రారంభిస్తున్న డ్వామా పీడీ సలీంబాషా

మాతాశిశు మరణాలకు మీదే బాధ్యత

డాక్టర్లు, సిబ్బందికి డీఎంహెచ్‌ఓ హెచ్చరిక

అనంతపురం టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు మరణాలు సంభవిస్తే ఆ ఆస్పత్రి పరిధిలో పనిచేస్తున్న డాక్టర్లు, గర్భిణులను పర్యవేక్షించే ఇతర వైద్య సిబ్బందిదే బాధ్యత అని డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈబీదేవి హెచ్చరించారు. జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో మాతాశిశుమరణాలపై శుక్రవారం ఆమె సమీక్ష నిర్వహించారు. గత రెండునెలల్లో జిల్లాలో జరిగిన మాతాశిశుమరణాలపై డీఎంహెచ్‌ఓ ఆరా తీశారు. ఆ మరణాలు జరగడానికి కారణాలు, వైద్యశాఖ తరపున తీసుకున్న చర్యలు గురించి ఆయా ఆస్పత్రుల డాక్టర్లు, సిబ్బందిని ప్రశ్నించారు. కొందరు డాక్టర్లు, సిబ్బంది మరణాలపై ఏవో కారణాలు చెప్పగా డీఎంహెచ్‌ఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ మాతా, శిశు మరణాలు జరగకూడదనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తూ ఆరోగ్యసేవలు ఉచితంగా అందిస్తున్నాయన్నారు. అయినా ఇంకా మరణాలు జరిగితే ఎలా అని ప్రశ్నించారు. గర్భిణిగా నమోదైనప్పటి నుంచి ఆమెకు అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్స, పౌష్టికాహారం అందేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. నెలవారీ పరీక్షలలో రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించి, వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. జన్మనిస్తూ ఏ తల్లి చనిపోకూడదు, జన్మించే ఏ బిడ్డ మరణించకూడదు అన్న లక్ష్యంతో ప్రతిఒక్కరూ పనిచేయాలన్నారు. సమీక్షలో డీసీహెచ్‌ఎస్ డాక్టరు రవికుమార్, అనస్తీషియా వైద్యనిపుణులు డాక్టరు నవీన్‌కుమార్, డీఐఓ డాక్టరు యుగంధర్ పాల్గొన్నారు.



సమీక్షలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి

వరించిన సంతోషం

24 గంటల్లో వరి ధాన్యం కొనుగోళ్ల సొమ్ము జమ



6

గ్యాస్ సరఫరా
టెండర్‌లో డ్రామా..!

7

పచ్చని చెట్లపై కత్తి వేటు

7

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అనంతపురం విద్య, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా కార్యదర్శి జాఫర్ అధ్యక్షతన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంగమేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ధర్నాలో రామకృష్ణ మాట్లాడుతూ పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు, రూ.4.5 లక్షలు నిర్మాణానికి ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తయినా ఇళ్లపట్టాల గురించి పట్టించుకోవడం లేదన్నారు. వైకుంఠ ఏకాదశి రోజు ప్రజలంతా పుణ్యం కోసం దేవాయాలల్లో కూర్చుంటే పేదోడి ఇంటి కోసం సీపీఐ నాయకులు కలెక్టర్ వద్ద నిరసన కార్యక్రమంలో కూర్చున్నారన్నారు. నగరాలు, గ్రామాల్లో పేదల ఇళ్ల కోసం పోరాడే ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకూ పోరాటం సాగిస్తామన్నారు. తర్వాత డీఆర్వో మలోలకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా సహాయకార్యదర్శులు నారాయణ స్వామి, మల్లికార్జున, కార్యదర్శివర్గసభ్యులు రాజారెడ్డి, కేశవ రెడ్డి, రామకృష్ణ, ఇతర నాయకులు, రమణ, అల్లిపీరా, లింగమయ్య, సంతోష్‌కుమార్,రాజేష్, చిరంజీవి, పెదయ్య కుళ్లాయిస్వామి, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

న్యూస్ బాక్స్

జాతీయస్థాయి ఆటశాల కాన్ఫరెన్స్ ప్రారంభం


ఆటశాల వర్క్‌షాపులో కోచ్‌లు, క్రీడానిపుణులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పాటు ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆటశాల కాన్ఫరెన్స్ శుక్రవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో ప్రారంభించారు. మొదటి రోజు ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, అథ్లెటిక్ క్రీడాకారిణి కీర్తన, ఏఎస్‌పీ కోచ్ కుమార్‌లు వర్క్‌షాపును ప్రారంభించారు. ఒడిశా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ పీఆర్‌ఓ సుహేల్‌తండన్ లైఫ్ స్కిల్స్, క్రీడావిద్యా సంస్కారంపై వివరించారు. బెంగళూరుకు చెందిన సింప్లీస్పోర్ట్ ఫౌండేషన్ అదితి ముటాత్కర్ మహిళా సాధికారత, బాలికల క్రీడాభాగస్వామ్యం వివరించారు. ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, సుహేల్‌తండన్‌లు క్రీడల్లో పాటించాల్సిన నియమ, నిబంధనలపై అవగాహన కల్పించారు. కాన్ఫరెన్స్ శనివారం కూడా కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

రైతులకు న్యాయమైన పరిహారం అందాలి

కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, జనవరి10(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చే రైతులకు న్యాయమైన పరిహారం అందేలా చూడాలని అధికారులను కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం డీఎల్‌సీ సమావేశం నిర్వహించా రు. కలెక్టరు మాట్లాడుతూ బెళుగుప్ప మండలం నరసాపురం గ్రామం వద్ద కొత్త రైల్వేస్టేషన్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అక్కడ స్టేషన్ నిర్మాణానికి 17.97ఎకరాల విస్తీర్ణంలో భూములను సేకరిస్తామన్నారు. ఆభూములు కోల్పోయే రైతులకు నష్టపరిహారం చెల్లించే విషయంలో ప్రతిపాదిత మార్కెట్ విలువకు అనుగుణంగా పరిహారం సొమ్ము ఇచ్చామన్నారు. ట్రాన్స్‌కో విభాగానికి 21టవర్లు, 132, 220,400 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్‌లను మార్చడం కోసం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం మార్కెట్ విలువకు అనుగుణంగా మూడు విధాలుగా నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. పరిహారం పంపిణీ పూర్తికావడంతో పనులు చేపట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టరు ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు శివనారాయణశర్మ, కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, హార్టికల్చర్ జేడీ నరసింహారావు, ఎన్‌హెచ్ ఏపీడీ తరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వామ్మో చిరుత..!


కొండలో సంచరిస్తున్న చిరుత

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 10(ఆంధ్ర జ్యోతి): వ మున్సిపాలిటీ పరిధి ముదిగల్లు గ్రామంలో శుక్రవారం చిరుత కలకలం రేపింది. ఇళ్ల పక్కనే ఉన్న కొండల్లో చిరుత కనిపించడంతో ప్రజలు భయాందోళనలకు లోనయ్యారు. తరచూ చిరుత సంచరిస్తుండటంతో పొలాల్లోకి వెళ్లాలంటే రైతులు భయపడిపోతున్నారు. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించడం లేదని వారు వాపోతున్నారు.

24న అనంతకు విద్యాశాఖ కమిషనర్ రాక

అనంతపురం విద్య, జనవరి 10(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఈ నెల 24న జిల్లాకు రానున్నారు. తొలిసారి ఆయన అనంతపురం జిల్లాకు రానున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల విద్యాశాఖాధికారులతోపాటు, ఐసీడీఎస్ అధికారులతో కమిషనర్ వేర్వేరుగా సమావేశం నిర్వహించనున్నారు. ముఖ్యంగా 117 జీవో ఉప సంహరణ, స్కూల్ కాంప్లెక్స్ మోడిఫికేషన్ తదితర అంశాలపై డీఈఓలు, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించనున్నారు. సమావేశం నిర్వహించే వేదికను ఎంపిక చేసే పనిలో విద్యాశాఖాధికారులున్నారు. అనంతపురంలోని జేఎన్‌టీయూ లేదా ఇతర ప్రాంతాల్లో సమావేశం నిర్వహించే అవకాశం ఉంది.

వరించిన సంతోషం

24 గంటల్లో వరి ధాన్యం కొనుగోళ్ల సొమ్ము జమ


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

గతేడాది మూడు నెలల వరకు ఎదురుచూపులు

కూటమి ప్రభుత్వ తీరుపట్ల అన్నదాతల హర్షం

బొమ్మనహాళ్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వరి ధ్యానం విక్రయించిన 24గంటల్లోనే ప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాల్లోకి సొమ్ములు జమ చేస్తుండటం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. గత వైసీపీ పాలనలో ధాన్యం డబ్బులు కోసం రైతులు నెలల తరబడి ఎదురు చూశారు. ధాన్యం విక్రయించిన 90 రోజులకు కూడా నగదు అందకపోవడంతో పౌరసరఫరాల శాఖ అధికారుల చుట్టూ అన్నదాతలు ప్రదక్షిణ చేశారు. ప్రభుత్వ ఆలస్యంగా ధాన్యం సొమ్ము జమ చేస్తుండటంతో కొందరు రైతులు దళారులకే తమ పంటను విక్రయించారు. అయితే ఈ ఏడాది ఆ బాధలన్నీ తొలగిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల నుంచి సొమ్ము జమ చేసే వరకూ ప్రతిది పక్కాగా అమలు చేస్తుండంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు శ్రీధరఘట్ట సొసైటీ పరిధిలో 315 మంది రైతుల నుంచి 35,120 క్వింటాళ్ల వరిధాన్యం సేకరించారు. ఉద్దేహాళ్ సొసైటీ పరిధిలో 208 మంది రైతుల నుంచి 25,587 క్వింటాళ్లు సేకరించారు. ఈ ధాన్యం విలువ రూ.14.78 కోట్ల వరకు ఉంటుంది. ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రూ.14 కోట్లు జమ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. దీన్ని బట్టి కొనుగోలు ప్రక్రియ అంతా ఎంత వేగంగా జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు.

24 గంటల్లోనే..



169 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించా. 24 గంటల్లో నగదు బ్యాంక్ ఖాతాల్లో జమ అయింది. గత వైసీపీ పాలనలో ధాన్యం విక్రయించి నెలల తరబడి డబ్బు కోసం ఎదురు చూశా. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగానే 24 గంటల్లో నగదు ఖాతాలో జమ చేశారు. చాలా సంతోషంగా ఉంది. నా ఒక్కడికే కాదు ప్రభుత్వానికి విక్రయించిన ప్రతి రైతు సంతోషంగా ఉన్నారు.

- లక్ష్మన్న రైతు, రంగాపురంక్యాంప్

సమస్యగా మారిన తేమ

ఈ ఏడాది రైతులకు ధాన్యంలో తేమ సమస్యగా మారింది. ధాన్యంలో తేమ 25 శాతం వరకు ఉంటోంది. రెండు తుఫాన్ల ప్రభావంతో ఎండలు తక్కువగా ఉన్నాయి. అయితే తేమ శాతాన్ని వ్యవసాయ శాఖ సిబ్బందే క్షేత్రస్థాయిలో పరిశీలించి ధాన్యం కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. 17 శాతం కంటే తక్కువ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేస్తున్నారు. ఇలా కొనుగోలు చేశాక 24 నుంచి 48 గంటల్లోగా రైతుల ఖాతాలకు డబ్బు జమవుతోంది. ఈ పరిణామం రైతుల్లో ఆనందాన్ని నింపుతోంది.

నాలుగు రోజులకే ధాన్యం విక్రయించా



వరి పంట కోత కోసిన నాలుగు రోజులకే ధాన్యం విక్రయించా. ముందుగా రైతుసేవాకేంద్రంలో నమోదు చేసుకొన్నా. వెంటనే ఖాళీ సంచులు ఇచ్చారు. లారీ ఏర్పాటు చేశారు. వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించి లోడు చేసి పంపించిన 24 గంటల్లో నగదు జమ అయినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. 690 క్వింటాళ్లు విక్రయించా. రూ.15.45 లక్షలు నగదు బ్యాంక్ ఖాతాలో జమ అయింది. గతంలో ఎప్పుడు ఇంత త్వరగా ధాన్యం డబ్బులు రాలేదు.

- ఎర్రిస్వామి, రైతు, శ్రీధరఘట్ట

అన్నదాతకు కూటమి ప్రభుత్వం అండ



కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులను జమ చేస్తోంది. గతంలో ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత డబ్బులు కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేది. కానీ కూటమి పార్టీల పాలనలో పరిస్థితి మారింది. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోంది. రైతుకు అన్ని విధాలా అండగా నిలుస్తోంది. గత వైసీపీ పాలనలో ధాన్యం అమ్ముకోవడాని రైతులు పడ్డ కష్టాలు అన్నీఇన్నీ కావు. వీటిని సరిదిద్ది కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా నడిచేలా కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది.

- కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే

పాలిటెక్నిక్ విద్యార్థులకు లోకేశ్ ప్రశంసలు


నగదు అందిస్తున్న ప్రిన్సిపాల్

రాయదుర్గం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ ఫెస్ట్ 2024-25 పోటీలో ప్రతిభ కనబరిచి మంత్రి నారా లోకేశ్ నుంచి ప్రశంసలు అందుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్రీనివాసులు తెలిపారు. కళాశాల నుంచి ఎంపికైన రెండు ప్రాజెక్టులు లోకేశ్‌ను ఆకట్టుకున్నాయని వివరించారు. ప్రభుత్వం తరఫున ఈ ప్రాజెక్టులకు ప్రోత్సాహం అందిస్తామని లోకేశ్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం సోలార్‌తో నడిచే స్మార్ట్ వీల్‌చైర్‌ను కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు నరేష్, యోగేష్, మధుసూధన్ తయారని చెప్పారు. కుర్చీగానే కాకుండా బెడ్, రిక్లైనర్ లాగా కూడా ఉపయోగించుకోవచ్చు. పోర్టబుల్ టాయిలెట్‌ను కూడా అమర్చారు. కూలీలు తక్కువ శ్రమతో బరువులు మోసే పరికరాన్ని మెకానికల్ విద్యార్థులు ప్రసాద్, బాలాజీ, యశ్వంత్ తయారు చేశారు. ఈ ప్రాజెక్టుల రూపకల్పనకు ముఖ్యకారణమైన కళాశాల లెక్చరర్స్, ప్రాజెక్టు మెంటర్స్ ఎల్ హర్ష, అలీషా, కలాం, షేక్షబానాను ఆయన అభినందించారు. అత్యంత ప్రతిభ కనబరిచి విద్యార్థులు గెలుచుకున్న రూ. 10 వేలు బహుమతిని వారి చేతికి అందజేశారు.

కిడ్నాప్, చోరీ కేసులో నిందితుల అరెస్ట్


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ

తాడిపత్రి, జనవరి10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు గ్రామ సమీపంలో గన్నెవారిపల్లికాలనీకి చెందిన మహిళను కిడ్నాప్ చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. మహిళను కొట్టి మెడలో ఉన్న చైను, కమ్మలు దొంగతనం చేసిన కేసులో వీరాంజనేయులు, రాధమ్మ, భూలక్ష్మి, దశరథను అరెస్ట్ చేసి వారి నుంచి 3.2తులాల బంగారు గొలుసు, కమ్మలు, స్కార్పియో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రేణుకకు వీరాంజనేయులుకు గతంలో ఆర్థిక లావాదేవీలు ఉండడంతో మనస్పర్థలు ఉండేవన్నారు. అప్పటి నుంచి వీరాంజనేయులు రేణుకపై కక్ష పెంచుకున్నారన్నారు. అందులో భాగంగా రెండురోజుల క్రితం వీరాంజనేయులు, అతడి భార్య రాధమ్మ, అత్త భూలక్ష్మి, డ్రైవర్ దశరథ సాయంతో చుక్కలూరు వద్ద పనులకు వెళుతున్న రేణుకను స్కార్పియో వాహనంలో కిడ్నాప్ చేశారన్నారు. కొంతదూరం వెళ్లిన తర్వాత ఆమెను చితకబాది మెడలో ఉన్న బంగారు గొలుసు, కమ్మలు తీసుకొని ఆమెను అక్కడే వదిలేశారని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశామన్నారు. అందిన సమాచారం మేరకు చుక్కలూరు క్రాస్ వద్ద స్కార్పియోలో వెళుతున్న నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై తిరుగుబాటు

ట్రాక్టర్లను ఆపివేసిన గ్రామస్థులు

కళ్యాణదుర్గం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కంబదూరు మండల పరిధిలోని రాళ్లపల్లిలో ఇసుక అక్రమ రవాణాపై గ్రామస్థులు తిరగబడ్డారు. శుక్రవారం ఆ గ్రామ సమీపంలోని వంకలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండటంతో గ్రామ మహిళలు, గ్రామస్థులు ఎదురు తిరిగారు. వంకలో నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్లను నిలిపివేసి రోడ్డుకు


వీఆర్వో సూర్యనారాయణతో వాదిస్తున్న గ్రామస్థులు

అడ్డుగా నిలబడి నిరసన వ్యక్తం చేశారు. తాగడానికి నీరు లేక ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, గ్రామ సమీపంలోని ఇసుకనంతా తోడేస్తే ఎక్కడికి వెళ్లాలంటూ గ్రామస్థులు అధికారులను ప్రశ్నించారు. ఇక్కడి నుంచి ఒక్క ట్రాక్టర్ ఇసుకను కూడా రవాణా చేసేది లేదంటూ అక్కడికి వచ్చిన వీఆర్వో సూర్యనారాయణతో వాదించారు. ఉచిత ఇసుకయితే రోజుకు రెండు, మూడు ట్రాక్టర్లు రవాణా చేసుకోవాలే గానీ.. ఇలా ఈ వంక వద్ద ట్రాక్టర్లన్నీ క్యూ కడుతున్నాయన్నారు. దీంతో భూగర్భజలాలన్నీ ఎండిపోయే ప్రమాదం వుందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు, వీఆర్వో సూర్యనారాయణ స్పందించి ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తెలపడంతో గ్రామస్థులు శాంతించారు.


దారికి అడ్డంగా నిలబడిన గ్రామస్థులు

ఏటీఎం కేంద్రంలో మోసం

కార్డు మార్చి.. నగదు డ్రా..



గుత్తి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఏటీఎం సెంటర్‌కు వచ్చేవారిపై నిఘా ఉంచి డబ్బు డ్రాచేసి ఇస్తానని ఏమార్చి ఏటీఎం కార్డు మార్చేసి, అందులోని నగదు డ్రా చేసుకుని ఉడాయించాడు ఓ దుండగుడు. పట్టణంలో శుక్రవారం ఈ మోసం వెలుగుచూసింది. పట్టణానికి చెందిన వృద్ధురాలు లక్ష్మీదేవి.. భర్తతో ఏటీఎం కార్డు పంపించి, రూ.3000 డ్రా చేయమని చెప్పింది. అతనికి ఏటీఎం సెంటర్ వద్ద ఆపరేటింగ్ చేయడం రాకపోవడంతో అక్కడే ఉన్న ఓ యువకుడిని అడిగాడు. ఇదే చాన్స్ అనుకున్నాడు ఆ దుండగుడు. వృద్ధుడిని మభ్యపెట్టి ఏటీఎం కార్డు మార్చేశాడు. సర్వర్ బిజీ ఉంది కాసేపు ఆగి మరి డ్రా చేసుకో అంటూ అతని వద్దనున్న కార్డు మార్చి వేరొకటి ఇచ్చాడు. అక్కడి నుంచి వెళ్లిపోయి మరో ఏటీఎంలో 9,00,600 డ్రా చేశాడు. నగదు డ్రా చేసినట్లు వృద్ధుడి ఫోన్‌కు మెసేజ్ రావడంతో అయోమయానికి గురయ్యాడు. విషయాన్ని వెంటనే పోలీసులకు అందించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

గొంతు కోసుకుని వ్యక్తి మృతి

రాయదుర్గంరూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యల కారణంగా రాజన్న(60) అనే వ్యక్తి గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కాశీపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రాజన్న కూలీ పనులు చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. కొంతకాలంగా కుటుంబ సమస్యలతో సతమతమవుతూ మనస్తాపానికి గురై గురువారం రాత్రి గొంతు కోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య ముక్కమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జయనాయక్ తెలిపారు. మృతుడికి ఇద్దరు భార్యలు, ఇద్దరు కొడుకులు ఉన్నారని పేర్కొన్నారు.

పది ఇళ్లలో చోరీ

ఒక ఇంట్లో మాత్రమే వెండి, నగదు అపహరణ

తాడిపత్రి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్‌నగర్, ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఇళ్లు, పలు షాపుల్లో శుక్రవారం తెల్లవారుజామున దుండగులు చోరీకి పాల్పడ్డారు. అంబేద్కర్‌నగర్‌లో నివాసం ఉంటున్న శివనాగన్న ఇంట్లో రూ.50వేల నగదు, 30వేలు విలువగల వెండి, అరతులం బంగారం చోరీకి గురైందని పోలీసులు తెలిపారు. శివనాగన్న కుటుంబ సభ్యులతో కలిసి గుత్తికి వెళ్లాడు. బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న వెంకటనారాయణ హోటల్, మహేశ్వరరెడ్డి పైపుల దుకాణం, ఫొటోస్టుడియో, ఆర్‌ఎంపీ నివాసం, డెంటల్ ఆసుపత్రితోపాటు పలు ఇళ్లల్లో చోరీకి తెగబడ్డారు. ఒక్క ఇంటిలో తప్ప మరెక్కడా నగదు, ఆభరణాలు చోరీకి గురికాలేదు.

యువకుడి ఆత్మహత్య

తాడిపత్రి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నందలపాడుకు చెందిన నవీన్‌కుమార్ (21) అప్పుల బాధ తాళలేక శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పట్టణ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. నందలపాడుకు చెందిన ఆదినారాయణ, నాగరత్నమ్మ దంపతులకు ఇద్దరు సంతానం కాగా నవీన్‌కుమార్ రెండవవాడు. నవీన్‌కుమార్ గ్రానైట్ బండలను పరిచే పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొంతకాలం నుంచి చెడుఅలవాట్లకు బానిసై అప్పులు చేశాడు. ఒత్తిళ్లు ఎక్కువకావడంతో అప్పులు తీర్చేమార్గం కనిపించకపోవడంతో మనస్తాపానికి గురై ఇంటిలో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా..?

ముగిసిన రెవెన్యూ సదస్సులు

ప్రజల నుంచి భారీగా అర్జీల స్వీకరణ

రెవెన్యూ రికార్డుల్లో తప్పులే అధికం


బత్తలపల్లి మండలం మాల్యవంతం రెవెన్యూ సదస్సులో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ (ఫైల్)

ధర్మవరం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో నిబంధనలకు విరుద్ధంగా భూములను చెరబట్టడమే కాకుండా రాజకీయ జోక్యంతో వేలాది ఎకరాలను వివాదంలో పడేసి ఎంతో మందిని బాధితులుగా మార్చారు. బాధితుల గోడు వినకపోగా.. తిరిగి వారిపైనే కేసులు బనాయించి భూ మాఫియాకు వైసీపీ నేతలు అండగా నిలిచారన్న విమర్శలు అప్పట్లో వెల్లువెత్తాయి. గత ప్రభుత్వంలో భూసమస్యలపై వచ్చిన ఫిర్యాదులను బుట్టదాఖలు చేయడమే కాకుండా వాటిని వైసీపీ నేతలే హస్తగతం చేసుకున్న ఉదంతాలు కోకొల్లలు. ఈ పరంపరలోనే కూటమి ప్రభుత్వం కొలువు తీరడంతో భూ వివాదాలకు పరిష్కారం దొరుకుతుందనే ఆశతో పెద్ద సంఖ్యలో బాధితులు అధికారులను ఆశ్రయించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఎక్కువగా భూ వివాదాలకు సంబంధించిన అర్జీలు ఉన్నాయి. ప్రజాదర్బార్‌లలో సైతం ఎక్కువగా భూ బాధితులే ఉన్నారు. ఈ క్రమంలో ఆయా సమస్యలకు చెక్ పెట్టడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. రెవెన్యూ గ్రామాల ప్రామాణికంగా సదస్సులు నిర్వహించి భూ బాధితుల సమస్యలను పరిష్కరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా డిసెంబరు 6 నుంచి వాటికి శ్రీకారం చుట్టగా జనవరి 8వ తేదీన ముగిశాయి. ఒక్కో మండలంలో రోజుకు ఒక గ్రామంలో సదస్సు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. గ్రామంలోని భూ బాధితుల సమస్యలతో మళ్లీ అధికారులను ఆశ్రయించకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. దీంతో అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు రోజంతా ఒక్కో గ్రామంలో ఉండేలా షెడ్యూల్ రూపొందించుకుని బాధితుల నుంచి అర్జీల స్వీకరించి, కొన్ని అక్కడికక్కడే పరిష్కరిస్తూ వచ్చారు. ఈ సదస్సులు తహసీల్దార్ నేతృత్వంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్, వీఆర్‌ఓలు బృందంగా ఏర్పడి పాల్గొన్నారు. వీరితో పాటు దేవదాయ, రిజిస్ట్రేషన్, అటవీ, పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు కూడా హాజరయ్యారు. ఈ సదస్సులతో అయినా భూ సమస్యలకు చెక్ పడాలని బాధితులు ఎదురుచూస్తున్నారు. నెలకుపైగా జరిగిన సదస్సుల్లో రెవెన్యూ రికార్డుల్లో తప్పులే అధికంగా ఉన్నాయి. సమస్యలపై ఆయా సదస్సుల్లో బాధితులు బారులు తీరారు. రికార్డుల్లో ఉండాల్సిన భూమి కంటే తక్కువ విస్తీర్ణం ఉందని పలువురు నివేదించారు. ఇలాంటి ఫిర్యాదుల విషయంలో ఉన్నతస్థాయిలో సర్వే నిర్వహించి తుది నిర్ణయాన్ని ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. ముందుగా ఇరుపార్టీలకు నోటీసులు జారీ చేయడంతో పాటు సిబ్బంది విచారణ చేపడుతారని తరువాతే వీటి విషయంలో తుది నిర్ణయం తీసుకోవడానికి వీలుంటుందని యంత్రాంగం చెబుతోంది. సదస్సులో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపడుతామని అధికారులు చెబుతున్నారు. ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో కూడా రెవెన్యూ సదస్సులో ఫిర్యాదులు అందాయి.

462 గ్రామాల్లో సదస్సులు

శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా 462 గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో 49 రకాల సమస్యలపై 4,522 ఫిర్యాదులు అందాయి. ఇందులో రెవెన్యూ అధికారులు 2023 ఫిర్యాదులను పరిష్కరించినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన 2,499 అర్జీలను 45 రోజుల్లో పరిష్కరిస్తామని అధికారులు అంటున్నారు. జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదుల్లో రెవెన్యూ రికార్డుల్లో తప్పులపై 1446, పొలాల సరిహద్దులు 364, మ్యూటేషన్ 263, సాగు, ఇళ్లపట్టాలు 4,123, విస్తీర్ణంలో తేడాలు 226, ఇతర సమస్యలపై 1810 వచ్చినట్టు జిల్లా రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

జగనన్న కాలనీలపై విజిలెన్స్ విచారణ

ధర్మవరంరూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగాటిపల్లిలో గత వైసీపీ హయాంలో జగనన్న కాలనీల కోసం భూములిచ్చిన రైతులతో శుక్రవారం విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం, సీఐ సద్గురుడు విచారణ చేశారు. ఎంతమంది రైతులు భూములు ఇచ్చారు, ఎన్ని ఎకరాలు సేకరించారు అన్న వివరాలను తెలుసుకున్నారు. 23 మంది రైతులు, 73.34 ఎకరాలు భూములు ఇచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అనంతరం విజిలెన్స్ డీఎస్పీ, సీఐలు రైతులతో మాట్లాడుతూ.. ఇష్టపూర్వకంగానే భూములు ఇచ్చారా, అప్పట్లో ఎవరైనా బలవంతంగా తీసుకున్నారా, పరిహారం పూర్తిగా ఇచ్చారా, ఇప్పటి వరకు ఎవరికైనా పరిహారం ఇవ్వలేదా అని ఆరాతీశారు. ఏమైనా ఇబ్బందులు పెట్టి ఉంటే తమ దృష్టికి తేవాలని తెలిపారు.


రైతులతో వివరాలు సేకరిస్తున్న విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం

పిల్లల లెక్క తప్పితే.. హెచ్‌ఎంలదే బాధ్యత

20 నుంచి జిల్లాల పర్యటనకు వస్తా

వీసీలో విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు


వీసీలో మాట్లాడుతున్న కమిషనర్, హాజరైన డీఈఓ ఇతర అధికారులు

అనంతపురం విద్య, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్యపై తప్పుడు సమాచారం ఇచ్చినా... లెక్కలు తప్పినా...చర్యలు తప్పవని విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు హెచ్చరించారు. ఈనెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ జిల్లాల పర్యటనకు వస్తానని, జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ పంగల్ రోడ్డులోని ఆర్డీటీ ఆడిటోరియంలో డీఈఓ ప్రసాద్‌బాబు, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, కాంప్లెక్స్ స్కూల్ ప్రధానోపాధ్యాయులతో విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యంగా117 జీవో రద్దు, ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు, బోధనా సిబ్బంది పునర్విభజన తదితర అంశాలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. 20వ తేదీ తర్వాత తాను జిల్లాల పర్యటనకు వస్తానన్నారు. మీరు చెబుతున్న డేటాకు, క్షేత్రస్థాయిలో ఉన్న దానికి తేడా ఉండకూడదన్నారు. విద్యాశాఖ పిల్లల కోసం ఎంతగానో ఖర్చు చేస్తోందన్నారు. హెచ్‌ఎంలు ఇచ్చే డేటా మేరకే పిల్లల కోసం కిట్లు, బుక్స్ ఇతర మెటీరియల్ కొంటున్నారన్నారు. డబ్బులు వృథాకాకూడదని అన్నారు. ప్రధానోపాధ్యాయలు తప్పుడు డేటా ఇస్తే...చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇచ్చిన గైడ్‌లైన్స్ చదవకుండా... తాను జిల్లా పర్యటనలకు వచ్చినప్పుడు డీఈఓలు, డీవైఈఓలు, ఎంఈఓలు సైతం తనకు సంబంధం లేదని అనడానికి వీల్లేదన్నారు. సమావేశంలో డీవైఈఓలు శ్రీనివాసులు, శ్రీదేవి, ఎంఈఓలు, సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారులు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

సైబర్ దొంగ ఆటకట్టు

డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.30 లక్షల డిమాండ్

ధైర్యంగా ఎదుర్కొన్న రిటైర్డ్ ఉద్యోగి



రిటైర్డ్ ఉద్యోగి నారాయణరెడ్డిని సన్మానిస్తున్న సీఐలు

అనంతపురం క్రైం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్ట్ పేరుతో ఓ సైబర్ నేరగాడు ఓ రిటైర్డ్ ఉద్యోగిని డబ్బు డిమాండ్ చేశాడు. ఆ నేరగాన్ని రిటైర్డ్ ఉద్యోగి ధైర్యంగా ఎదుర్కొన్నాడు. పోలీసుల సాయంతో రూ.30లక్షలు రక్షించుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి.. 'నీవు క్రిమినల్ కేసులో ఇరుక్కున్నావు.. నిన్ను తప్పించాలంటే రూ.30 లక్షలు డబ్బు ఇవ్వాలి' అంటూ సైబర్ నేరగాడు అనంతపురానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి నారాయియణరెడ్డిని వేధించసాగాడు. రెండ్రోజుల నుంచి ఫోన్‌లో ఇదేవిధంగా సతాయించాడు. ఇదంతా డబ్బు కాజేయడానికే సైబర్ నేరగాడు తనను బెదిరిస్తున్నట్లు నారాయియణరెడ్డి భావించాడు. డిజిటల్ అరెస్టుపై అవగాహన కలిగి ఉండటంతో శుక్రవారం సైబర్ పోలీస్ విభాగాన్ని సంప్రదించాడు. సీఐ జాకీర్ నారాయియణరెడ్డి వాయిస్ పూర్తిగా విన్నారు. ఆలస్యం చేయకుండా నారాయణరెడ్డిని స్థానిక టూటౌన్ సీఐ శ్రీకాంత్ వద్దకు తీసుకెళ్లారు. అవతలి నుంచి రూ.30 లక్షల కోసం తరచూ ఫోన్ చేస్తున్న సైబర్ నేరగాడితో సీఐ శ్రీకాంత్ మాట్లాడారు. నీవు సైబర్ నేరగాడివని, ప్రజలను ఇలా సైబర్ ఫ్రాడ్స్‌కు గురి చేస్తే చట్టపరంగా కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామని సీఐ హెచ్చరించారు. దీంతో అవతలి సైబర్ నేరగాడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండటం, డిజిటల్ అరెస్ట్ పేరుతో డబ్బు డిమాండ్ చేసే వారిని పోలీసులు సంప్రదించి ధైర్యంగా ఎదుర్కొంటే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా సేఫ్‌గా ఉండొచ్చని సీఐలు సూచించారు. రిటైర్డ్ ఉద్యోగి నారాయణరెడ్డిని జిల్లా ఎస్పీ జగదీష్ అభినందించారు. అనంతరం నారాయణరెడ్డిని టూటౌన్ సీఐ శ్రీకాంత్, సైబర్ సెల్ సీఐ షేక్ జాకీర్ అభినందిస్తూ పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి



ప్రసాద్ (ఫైల్)

బుక్కరాయసముద్రం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పసులూరు గ్రామ శివారులోని క్వారీలో ఉన్న నీటి గుంతలో ఈతకు వెళ్లి దుబ్బప్పగారి ప్రసాద్(11) అనే బాలుడు శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పసులూరు గ్రామానికి చెందిన దుబ్బప్పగారి ఓబులేసు, అంజినమ్మ దంపతుల కుమారుడు ప్రసాద్ అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులు కావడంతో మధ్యాహ్నం ప్రసాద్ తోటి స్నేహితులతో కలిసి గ్రామ శివారులో ఉన్న కమ్మగుడ్డము అనే కొండ క్వారీ వద్దకు ఈతకు వెళ్లారు. క్వారీలో ఉన్న నీటిగుంతలో ఈత కోసం దిగారు. ప్రసాద్‌కు ఈత రాదు. క్వారీ గుంత లోతు ఎక్కువ ఉడడంతో నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. అతడి తోటి స్నేహితులు గట్టిగా కేకలు వేయడంతో పక్కనే పొలాల్లో ఉన్న రైతులు వచ్చి ప్రసాద్‌ను నీటి గుంతలో నుంచి బయటికి తీశారు. అప్పటికే ఆ బాలుడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సరఫరా టెండర్‌లో డ్రామా!

రెండునెలలకు పిలుపు

డిపాజిట్ మొత్తం పెంపు

ఎవరూ రాకూడదనేనా?

శాఖ ఆధ్వర్యంలో నిర్వహణకు అధికారుల పన్నాగం



హెచ్‌పీ గ్యాస్ గోడౌన్

అనంతపురం టౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): గ్యాస్ పంపిణీకి ప్రైవేటు వ్యక్తులు ముందుకు రాకుండా ఆ శాఖ అధికారులు పెద్ద డ్రామాకు తెరలేపారు. తమ ఆధ్వర్యంలోనే సరఫరా జరిగితే వచ్చే కమీషన్ బొక్కేయవచ్చన్నది వారి పన్నాగం. టెండర్ గడువు ముగిసి ఏడాది కావస్తున్నా పిలవకుండా వారే సరఫరా చేయిస్తున్నారు. ఇక రెండు నెలలకు గడువు ముగియనుండడంతో ఉన్నఫలంగా టెండర్లు పిలవడం, గతంకన్నా డిపాజిట్లకు అధిక ధరలు నిర్ణయించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ టెండర్‌కు ఎవరూ ముందుకు రాకూడదనే అధికారులు కుట్ర చేశారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

ఇదీ విషయం..

పౌరసరఫరాల శాఖ కార్యాలయం సమీపంలోనే హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ఉంది. దీని పరిధిలో 10వేల వరకు కనెక్షన్లు ఉంటాయి. గ్యాస్ గోడౌన్‌ను ఆ శాఖ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నారు. సాధారణంగా గ్యాస్ సరఫరాకు టెండర్లు పిలవడం, టెండర్ దక్కించుకున్న వారికి సరఫరా బాధ్యతలు అప్పగించడం చేస్తుంటారు. గ్యాస్ సరఫరా చేసినందుకు సిలిండర్‌కు ప్రస్తుతం రూ.8 కమీషన్ ఇస్తున్నారు. 2024 మార్చిలోనే గ్యాస్ సరఫరా టెండర్ గడువు ముగిసింది. తర్వాత కొత్త టెండర్ పిలవలేదు. వివిధ కారణాలు చూపుతూ అప్పటి నుంచి ఆ శాఖ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నారు. సరఫరా చేసిన బాయ్స్‌కు డబ్బు ఇస్తూ మిగిలిన సొమ్ము స్వాహా చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతోనే టెండర్ జరగకుండా ఇంతకాలం కాలయాపన చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఆఖర్లో హడావుడి..

మూడు రోజుల క్రితం హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల సరఫరాకు టెండర్లు పిలిచారు. ఇందులో మతలబు ఉన్నట్లు ఆ శాఖ అధికారులపై వస్తున్న ఆరోపణలకు మరింత బలం చేకూరుతోంది. పదేళ్ల క్రితం టెండర్ దరఖాస్తు ధర రూ.5వేలు, ఈఎండీ రూ.2లక్షల డీడీ, మరో మూడు లక్షలు సెక్యూరిటీ డిపాజిల్ ఉండేదని సమాచారం. అపుడు సిలిండర్ సరఫరాకు రూ.5 కమీషన్ ఇచ్చేవారు. ఆరేళ్ల క్రితం టెండర్ దరఖాస్తు ధర రూ.10 వేలు, ఈఎండీ రూ.2 లక్షలు, సెక్యూరిటీ డిపాజిల్ రూ.5లక్షలు నిర్ణయించారు. అప్పటి నుంచి సిలిండర్ సరఫరాకు రూ.8 చొప్పున ఇస్తున్నారు. తాజాగా ఇచ్చిన నోటిఫికేషన్‌లో టెండర్ దరఖాస్తు ధర రూ.25 వేలకు పెంచారు. ఈఎండీ రూ.2.50 లక్షలు, సెక్యూరిటీ డిపాజిట్ రూ7.50 లక్షలు చొప్పున పెంచేశారు. సిలిండర్ సరఫరాకు మాత్రం రూ.8 నిర్ణయించారు. ఈ టెండర్ మార్చి వరకే.. అంటే రెండున్నర నెలలు ఉంటుంది. ఇంత ధర పెడితే ఎవరూ టెండర్‌కు ముందుకురారనీ, తామే ఎంచక్కా గ్యాస్ సరఫరాను కొనసాగించి.. బాయ్స్‌కు అంతోఇంతో ఇచ్చేసి జేబులు నింపేసుకుందామనే ఇలా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈనెల 17వ తేదీ వరకు టెండర్లకు గడువు ఉంది. ఇప్పటి వరకు ఎవరూ ముందుకు రాలేదు.

మార్చి తర్వాత మళ్లీ టెండర్



గత ఏడాది మార్చికే గ్యాస్ సరఫరా టెండర్ గడువు ముగిసింది. అప్పట్లో టెండర్ పిలవడానికి ఎన్నికల ప్రక్రియ తదితర కారణాలు అడ్డువచ్చాయి. దీంతో మా శాఖ ద్వారానే బాయ్స్‌ను నియమించుకుని సరఫరా చేస్తున్నాం. తాజాగా టెండర్లు పిలిచాం. ఈ టెండర్ కూడా ఈ ఏడాది మార్చి వరకే ఉంటుంది. టెండర్ ధరలు ఉన్నతాధికారుల నిర్ణయమే. మార్చి తర్వాత మళ్లీ టెండర్లు పిలుస్తాం.

- రమేష్‌రెడ్డి, డీఎం, పౌరసరఫరాల శాఖ

పచ్చని చెట్లపై కత్తి

- టీడీపీ నాయకుడి తోటలో 1052 అరటి చెట్ల నరికివేత
- డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు
- పరిశీలించిన టీడీపీ నాయకులు



నరికేసిన అరటిచెట్లు



పరిశీలిస్తున్న డీఎస్పీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, నాయకులు

పుట్లూరు/యల్లనూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): చేతికొచ్చిన అరటి తోటపై దుండగలు తమ ప్రతాపం చూపారు. నెల రోజుల్లో పంట కోయాల్సిన గెలలతో కూడిన తోటను ఇష్టానుసారం నరికివేయడంతో నేలపాలైంది. పుట్లూరు మండలం కొండుగారికుంట గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడుకు చెందిన అరటి చెట్లను శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. యల్లనూరు మండలం బొప్పేపల్లి రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 607లో 3.50 ఎకరాల్లో సుదర్శన్‌నాయుడు 4,500 అరటిచెట్లను సాగుచేస్తున్నారు. ఇందులో 1052 చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. ఉదయం 7 గంటలకు తోటకు వెళ్లిన సుదర్శన్‌నాయుడు చెట్లను నరికివేయడం గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. నెలరోజుల తర్వాత అరటి గెలలు కోతకు వచ్చేవి. ఈ సమయంలో నరికివేయడంతో సుమారు రూ.6లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు. ధర కూడా ఆశించినస్థాయిలో ఉండడంతో నెలరోజుల తర్వాత చేతికి వచ్చే పంటను ముందుగానే ఓ వ్యాపారి ఒప్పందం కుదుర్చుకున్నాడు. సంఘటనాస్థలాన్ని డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ సత్యబాబు, ఏఎస్ఐలు పరిశీలించారు. యల్లనూరు పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు

అరటిచెట్లను నరికివేశారన్న విషయం తెలుసుకున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు గ్రామానికి చేరుకొని చుట్టుపక్కల తోటలను పరిశీలించారు. నిందితుల గుర్తింపు కోసం జిల్లా కేంద్రం నుంచి డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి తనిఖీ చేయించారు. డాగ్‌స్క్వాడ్ తోటలో నుంచి గ్రామంలోని బస్టాప్ వరకు వెళ్లి అక్కడే ఆగిపోయింది. దీంతో నిందితులు చెట్లు నరికివేసి గ్రామంలోని బస్టాప్ వద్దకు వచ్చి వెళ్లినట్లు పోలీసులు భావిస్తున్నారు.

పరిశీలించిన టీడీపీ నాయకులు

సుదర్శన్‌నాయుడుకు చెందిన అరటిచెట్లను నరికివేశారన్న సమాచారం తెలుసుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, మాజీ ఎమ్మెల్యే యామినీబాల, ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు, నాయకులు అశోక్, బాలరంగయ్య తోటకు వద్దకు చేరుకొని నరికివేసిన చెట్లను పరిశీలించారు. సుదర్శన్‌నాయుడును పరామర్శించారు. అరటిచెట్లు నరకడం పిరికిపంద చర్య అని వెంకటశివుడు యాదవ్, నరసానాయుడు ఖండించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పుట్లూరు, యల్లనూరు తహసీల్దార్లు శేషారెడ్డి, రాజా, వీఆర్వోలు తోటను పరిశీలించారు. పరామర్శించిన వారిలో టీడీపీ నాయకులు కులశేఖర్‌రెడ్డి, విజయకుమార్‌నాయుడు, శివశంకర్‌రెడ్డి, గోవర్ధన్‌రాజు, రవిచంద్రనాయుడు, రామాంజనేయులు, భాస్కర్‌నాయుడు, చెన్నారెడ్డి, రవికుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సొసైటీ ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి



సొసైటీ ఉద్యోగుల ధర్నాలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సొసైటీ ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ ఏపీ స్టేట్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సుభాష్‌రోడ్డులోని ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. ఆంజనేయులు, జె. హరికృష్ణ మాట్లాడుతూ 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబరు 36ను అమలు చేయకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. దీంతో సొసైటీ ఉద్యోగులు హెచ్‌ఆర్ పాలసీ వర్తింపచేయకపోవడంతో తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. వేతనసవరణ జరిగేలోపు మధ్యంతర భృతి ఇవ్వాలని, జిల్లా స్థాయిలో సహకార నిధి ఏర్పాటు చేయాలన్నారు. సీఐటీయూ నాయకులు నాగేంద్ర, రైతుసంఘం నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, బీహెచ్ రాయుడు, ఏడీసీసీ బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు భరత్, సోమశేఖర్, సునీత సొసైటీ ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాసులు, హనుమంతరెడ్డి, రామాంజనేయులు, దామోదర్, నరేంద్రరెడ్డి, బొజ్జప్ప పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నలుగురి అరెస్టు

పరారీలో మరో ఇద్దరు కీలక నిందితులు



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐలు

హిందూపురం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టుచీరల పాలిష్ వ్యాపారి నారాయణరెడ్డిపై హత్యాయత్నం కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం నిందితుల అరెస్టు వివరాలను ఇన్‌చార్జి డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. హిందూపురం పట్టణం దండు రోడ్డు ప్రాంతంలో నివాసముంటున్న నారాయణరెడ్డి నాలుగేళ్లపాటు ముద్దిరెడ్డిపల్లిలోని అరవిందనగర్‌కు చెందిన బాలకృష్ణ అలియాస్ బాలు వద్ద డ్రైవర్‌గా పనిచేశాడు. ఇతడు చీరలను పాలిష్‌చేసి ధర్మవరం, హిందూపురానికి సరఫరా చేసేవాడు. నాలుగు నెలల క్రితం ఆర్థికపరమైన అంశాలతో నారాయణరెడ్డి, బాలకృష్ణ విడిపోయారు. నారాయణరెడ్డి సొంతంగా మినీ వ్యాన్ తెచ్చుకుని ధర్మవరం, ముద్దిరెడ్డిపల్లి నుంచి పట్టుచీరలు తీసుకొచ్చి కర్ణాటకలోని యలహంకలో పాలిష్ చేయించి అప్పగించేవాడు. నారాయణరెడ్డి.. బాలకృష్ణకు చెందిన చీరలు బయటకు తరలించే సమయంలో అధికారులకు చెప్పి ఇబ్బందులు పెట్టేవాడు. వాణిజ్య పన్నులశాఖ, జీఎస్టీ అధికారులకు సమాచారం ఇచ్చి జరిమానా కూడా వేయించారు. దీంతో నారాయణరెడ్డిని ఎలాగైనా అంతమొందించాలని బాలకృష్ణ నిశ్చయించుకున్నాడు. వీరిద్దరి వద్ద సన్నిహితంగా ఉండే శాంతినగర్‌కు చెందిన ఫకృద్దీన్ అలియాస్ చోటు అనే వ్యక్తి ద్వారా కర్ణాటక రాష్ట్రం గౌరీబిదనూరుకు చెందిన ముబారక్, ఫారూక్ అలియాస్ చిరి కలిసి నారాయణరెడ్డిని హత్య చేయడానికి రూ.5లక్షలు సుపారీ మాట్లాడుకున్నారు. అందులో రూ.4 లక్షలు అడ్వాన్సుగా చెల్లించాడు. గతంలో రెండుమార్లు గౌరీబిదునూరు నారాయణరెడ్డి ఇంటివద్ద ప్రయత్నాలు చేసినా.. అవి విఫలమయ్యాయి. ఈ తరుణంలో ఈనెల 7న నారాయణరెడ్డి డ్రైవర్ తౌసిఫ్ ఇజ్‌తెమా కారణంగా విధులకు రాలేదు. దీంతో నారాయణరెడ్డే సొంతంగా వాహనం నడుపుకుని బెంగళూరుకు చీరలు తీసుకెళ్లి పాలిష్ చేయించాడు. అదేరోజు మద్యం సేవిద్దామని ఫకృద్దీన్ అలియాస్ చోటుకు చెప్పాడు. ఇదే అదునుగా భావించి కర్ణాటకలోని గౌరీబిదునూరుకు చెందిన ముబారక్, మహ్మద్ ఫారూక్, టిప్టూర్‌కు చెందిన సైఫుల్లా, ఉమర్ కలిసి హిందూపురం మండలంలోని పూలకుంట చెరువుకట్ట వద్దగల లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపానికి చేరేసరికి అర్ధరాత్రి దాటింది. చోటు, మరో ఐదుగురు నారాయణరెడ్డిని తీసుకెళ్లి మద్యం తాగారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి గొంతును కత్తితో కోశారు. తీవ్ర రక్తస్రావం కావడంతో చనిపోయాడని నిందితులు పరారయ్యారు. బాలకృష్ణ అలియాస్ బాలు ఘటన జరిగిన మరుసటి రోజు ఫోన్‌పే ద్వారా గౌరీబిదనూరుకు చెందినవారికి డబ్బు పంపించాడు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఐలు రాజగోపాల్ నాయుడు, జనార్దన్, ఆంజనేయులు నిందితులను చాకచక్యంగా పట్టుకున్నారు. బాలకృష్ణ అలియాస్ బాలు, చోటు, ముబారక్, మహమ్మద్ ఫారూక్ శుక్రవారం తూమకుంట చెక్‌పోస్టు వద్ద ఉండగా నలుగురిని అదుపులోకి తీసుకుని, విచారణ చేశారు. నేరం ఒప్పుకోవడంతో నలుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు. వారి నుంచి రూ.63వేలు నగదు, బైక్, కత్తి, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు సైఫుల్లా, ఉమర్ పరారీలో ఉన్నారు.

శ్రీశైలం జలాశయం

నీటిని కాపాడండి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం నీటిని కాపాడి రాయలసీమ రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీశైలం జలాశయంలోని నీటిని అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు విద్యుత్ ఉత్పత్తి పేరుతో పూర్తిగా తోడేస్తున్నాయని విమర్శించారు. ఈ ఏడాది శ్రీశైలం జలాశయానికి 1,622 టీఎంసీల వరద నీరు హంద్రీనీవా కింద సాగైన పంటలు పూర్తయ్యేవరకూ వచ్చే పరిస్థితి లేకపోవ.డంపై ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీశైలం డ్యాంలో వచ్చిన నీటిని ఇప్పటికే తెలంగాణ 358.84 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ 199.38 టీఎంసీలు విద్యుత్ ఉత్పత్తి పేరుతో కిందకు వదిలేశాయన్నారు. ప్రస్తుతం డ్యాంలో 105 టీఎంసీల నీరు మాత్రమే ఉందన్నారు. ఈ కొద్దిపాటి నీటితో హంద్రీనీవా కాలువ కింద సాగైన పంటలు పూర్తయ్యే అవకాశం లేదన్నారు. గతేడాది వర్షాభావం వల్ల పంటలు చేతికి వచ్చే సమయంలో నీరు లేక అనంతపురం, కర్నూలు జిల్లాల రైతులు కోట్ల రూపాయలు నష్టపోయారని గుర్తుచేశారు. పదివేల క్యూసెక్కుల సైజులో కాలువ వెడల్పు చేస్తామని చెప్పిన టీడీపీ ప్రభుత్వం శ్రీశైలంలో ఉన్న నీటిని తెలంగాణ ప్రభుత్వం తోడేస్తుంటే అడ్డుకోవాల్సిందిపోయి పోటీపడి కిందకు వదిలి జలాశయాన్ని ఖాళీ చేయిస్తోందని విమర్శించారు. వెడల్పు, ప్రస్తుత పంటల రక్షణ కోసం హంద్రీనీవా సాగుదార్లతో ఈనెల 19న కర్నూలులో సదస్సు, 27న అనంతపురం, కర్నూలు, నంద్యాల, తిరుపతి, చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

దివ్యాంగులకు శుభవార్త

మూడుచక్రాల వాహనదారులకు సబ్సిడీతో పెట్రోల్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు శుభవార్త చెప్పింది. శారీరక దివ్యాంగులు మూడు చక్రాల వాహనాలకు వాడే పెట్రోలుకు సంబంధించి సబ్సిడీ ఇచ్చేందుకు నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ బి. వినోద్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వివరాలు వెల్లడించారు. సొంత వ్యాపారాలు, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు, డిగ్రీ, పీజీ చదివే విద్యార్థులు మూడు చక్రాల వాహనాలు కలిగి ఉన్న శారీరక దివ్యాంగులకు పెట్రోలుకు 50 శాతం సబ్సిడీ చెల్లించనుంది. నెలలో వాడిన పెట్రోలుకు 50 శాతం సబ్సిడీ రూపంలో నగదును అందజేయనుంది. పెట్రోల్ సబ్సిడీ కోసం దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, పెట్రోలు బిల్లులు, బ్యాంకు ఖాతా పుస్తకం మొదట పేజీ, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు 3, మూడు చక్రాల వాహనం ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్సు పత్రాలతో పాటు వ్యాపారం, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 21వ తేదీలోపు దరఖాస్తులు జిల్లా కేంద్రంలోని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 08554-232380 నంబరులో సంప్రదించాలన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాదిండి గ్రామంలో కడుపు నొప్పి భరించలేక ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి(42) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండేవాడు. అయితే గత కొంతకాలంగా గ్రామంలోనే వర్క్‌ఫ్రం హోం కింద విధులు నిర్వహిస్తుండేవాడు. భార్య హేమలత కూడా చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తోంది. శ్రీకాంత్‌రెడ్డి కొంతకాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. పలు ఆస్పత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో తీవ్రంగా మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంటిపైకి వెళ్లి పురుగులమందు సేవించాడు. ఎంత సేపటికి కుమారుడు కిందకు రాకపోవడంతో తండ్రి ఇంటిపైకి వెళ్లి చూశాడు, అపస్మారకస్థితి పడి ఉన్న శ్రీకాంత్‌రెడ్డిని వెంటనే కుటుంబసభ్యులు ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురంతరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి కుమారుడు ఉన్నాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

695 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శుక్రవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 684 ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కు 438 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.11

అనంతపురంరూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.11తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.9, కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.24వేలు

అనంతపురంరూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.24,320, కనిష్ఠంగా రూ.9,500, సరాసరి రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 18టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

వైకుంఠ శోభ..!

వైష్ణవ ఆలయాలు శుక్రవారం వైకుంఠ శోభను సంతరించుకున్నాయి. జిల్లాలోని అన్ని ఆలయాల్లో ఉత్తర ప్రవేశ ద్వారం గుండా భక్తులు స్వామివార్లను దర్శించుకున్నాయి. నగరంలోని ప్రసిద్ధి చెందిన చెన్నకేశ ఆలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. రైల్వే ఫీడర్ రోడ్డు, రామ్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు క్యూకట్టారు. అలాగే మండలాల్లోని ఆలయాల్లో వైకుంఠ ఏకాదశిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో క్యూలైన్‌లలో గంటలకొద్ది నిల్చొని స్వామివార్లను దర్శించుకున్నారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


రామగిరి: భక్తులతో కలిసి స్వామివారి దర్శనానికి వెళుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్


అనంతపురం: చెన్నకేశస్వామిని దర్శించుకునేందుకు క్యూలో నిల్చున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్


శింగనమలలో చెన్నకేశవస్వామి


బీకేఎస్‌లో లక్ష్మీనారాయణస్వామి


నార్పలలో...


రాప్తాడు: వేంకటేశ్వరస్వామి


కనగానపల్లిలో తిరుమల రాయుడు


చెన్నేకొత్తపల్లి: కనుమలో వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

న్యూస్ బాక్స్

ఇంటర్న్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలి


పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వినోద్ కుమార్ సూచించారు. పథకానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పథకం ద్వారా యువతకు ఉత్తమమైన ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్ చేయడానికి టాప్-500 కంపెనీలతో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. వివరాలకు 8341366022 నంబర్‌ను సంప్రదించాలన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అదనపు అధికారి జగన్‌యాదవ్ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఆర్ఓ మలోల

అనంతపురం టౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శుక్రవారం జిల్లాకలెక్టరేట్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కలెక్టరేట్ యూనిట్ నాయకులు హరిప్రసాద్, భరత్‌కుమార్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. వివిధ విభాగాల మహిళా ఉద్యోగులు ముగ్గులపోటీలలో పాల్గొన్నారు. కేఆర్ఆర్‌సీ తహసీల్దార్ వాణిశ్రీ బృందం మొదటి బహుమతి, సర్వేశాఖ రెండో బహుమతి, యూనియన్ బ్యాంకు బృందం మూడో బహుమతిని సాధించారు. విజేతలకు ఆర్డీఓ మలోలా బహుమతులు అందించారు. సర్వేశాఖ ఏడీ రూప్లా నాయక్, ఏఓ అలెగ్జాండర్ పాల్గొన్నారు.

ఎరా స్కూల్‌లో..


క్రీడా సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

అనంతపురంరూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచానపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం క్రీడా, సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి విద్యాసంస్థల అధినేత చిరంజీవిరెడ్డి,ఆయన సతీమణి సుశీలా రెడ్డి, నరేంద్రరెడ్డి, పాఠశాల చైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం సంకాంత్రి సంబరాలను నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి పాల్గొన్నారు.

సంప్రదాయానికి ప్రతీక సంక్రాంతి


వేడుకల్లో చైర్మన్ అనంతరాముడు, రమేష్‌బాబు

అనంతపురం సెంట్రల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తెలుగు సంప్రదాయానికి సంక్రాంతి పండుగ ప్రతీక అని అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాల చైర్మన్ అనంతరాముడు అన్నారు. శుక్రవారం కళాశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన అనంతరాముడు, వైస్ చైర్మన్ రమేష్‌బాబు దంపతులు వేడుకలు ప్రారంభించారు. సంప్రదాయ దుస్తుల్లో చిన్నారుల వేషాధారణ, డూడూ బసవన్నల చేత సన్నాయి మేళం, గంగిరెద్దుల సీతారామ కళ్యాణం, కోలాటం, గురువయ్యల నృత్యాలు, గొబ్బెమ్మ పాటలతో సంబరాలు అలరించాయి. సీఈఓ నరసింహారావు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


సంక్రాంతి కానుక ఇవ్వాలి


డీటీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురంరూరల్, జనవరి10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సంక్రాంతి కానుకలు కార్డుదారులకు ఇవ్వాలని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం చంద్రన్న సంక్రాంతి కానుక, రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని అనంతపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కమిటీ సభ్యుడు ముత్తుజా అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి నగర కార్యదర్శి రామిరెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రాజాకు వినతి పత్రం ఇచ్చారు. వెంకటనారాయణ, ప్రకాష్, గోపాల్, వలి, మసూద్, ఇర్ఫాన్, రాజు, శ్రీనివాసులు, వెంకటేశు, జీవ పాల్గొన్నారు.

రీసర్వేను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

శింగనమల, జనవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా భూములు రీసర్వే చేసిన గ్రామాల్లో రికార్డులను ఆన్‌లైన్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. నియోజకవర్గ కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు రీసర్వేలో భూముల వివరాలు తప్పులు ఉన్నాయని, ఎల్‌పీఎం నంబర్లను జాయింట్ ఖాతా నంబర్లతో ఇవ్వడం రైతులకు తేడాలతోపాటు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బాలరంగయ్య, భాస్కర్, సూర్య, ఎర్రిస్వామి, శ్రీనివాసులు, కొండారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నల్లప్ప

బందోబస్తును పర్యవేక్షించిన ఎస్పీ


తప్పిపోయిన బాలుడితో వివరాలు ఆరా తీస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని దేవాలయాల వద్ద నిర్వహిస్తున్న పోలీసు బందోబస్తు, భద్రతలను జిల్లా ఎస్పీ జగదీష్ పర్యవేక్షించారు. నగరంలోని పురాతనమైన చెన్నకేశవ దేవాలయం వద్ద శుక్రవారం బందోబస్తును పర్యవేక్షించి భక్తుల క్యూలైన్‌లను పరిశీలించారు. స్వామివారి దర్శనం కోసం విచ్చేసిన భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా, ఇబ్బంది పడకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దర్శనం కోసం వచ్చి తల్లిదండ్రుల ఆచూకీ తప్పిపోయిన మూడేళ్ల బాలుడి ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు బాలుడుని అప్పగించారు.

వడ్డె ఓబన్న జయంతిని విజయవంతం చేయండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వడ్డె ఓబన్న జయంతి వేడుకలను శనివారం నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ డీడీ సుభాషిణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె స్పష్టం చేశారు. శనివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని వడ్డెర్లు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

17 మంది ఉద్యోగాలకు ఎంపిక

నార్పల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఎంప్లామెంట్, సిడాప్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. రెండు కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 35 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా 17 మంది ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డేవిడ్, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి మహేష్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఆదినారాయణ, సిడాప్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

18న లలితకళాపరిషత్‌లో నృత్యప్రదర్శన

అనంతపురం అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని లలితకళా పరిషత్‌లో 18వతేదీన ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు బెస్త నారాయణస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. 18న సాయంత్రం 4 గంటల నుంచి ప్రముఖ నృత్య కళాకారుల ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు, ఏకపాత్ర అభినయాలు, సినిమా పాటల సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు చెర్లోపల్లి, గర్రిమేకలపల్లి, ఆయాలు గంగంపల్లి, పోలేపల్లి-2, రామగిరి-2,సుద్దకుంటపల్లిలో ఖాళీగా ఉన్నట్టు వారు తెలిపారు. వీటికి 25లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 10వ తరగతి పాసై 21 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాలోపు ఉండాలన్నారు. మరిన్ని వివరాల కోసం ఐసీడీఎస్ చెన్నేకొత్తపల్లి ప్రాజెక్టులో సంప్రదించాలన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

గార్లదిన్నె, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఓబులు వైద్యాధికారులకు సూచించారు. శుక్రవారం యర్రగుంట్ల గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటి ఫీవర్ సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. వైద్యాధికారి దిలీప్‌కుమార్, మలేరియా ఉప విభాగం అధికారి మద్దయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, సూపర్ వైజర్లు శ్రీధర్, విశ్వనాథ్, ఆరోగ్య కార్యకర్త సుబ్బయ్య పాల్గొన్నారు.

పాడి రైతులకు మెరుగైన సేవలు అందించాలి

అనంతపురం అర్బన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాడి రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని పశుసంవర్థక శాఖ జేడీ వెంకటస్వామి ఆదేశించారు. శుక్రవారం స్థానిక పశుసంవర్థక శాఖ అనంతపురం డివిజన్ కార్యాలయ సమావేశపు హాల్‌లో సంబంధిత అధికారులు, వెటర్నరీ డాక్టర్లతో ఆయన సమావేశమయ్యారు. సీజనల్ వారిగా పశువులకు తగిన వ్యాక్సినేషన్ చేసేలా చూడాలన్నారు. ఏడీ రమేష్‌రెడ్డి, వెటర్నరీ డాక్టర్లు పాల్గొన్నారు.

కొనకొండ్లలో చోరీ

ఉరవకొండ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని బిల్డింగ్ కాలనీలో నివాసముంటున్న మస్తానమ్మ అనే మహిళ ఇంట్లో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మస్తానమ్మ మూడు రోజుల క్రితం ఇంటికి తాళాలు వేసి తీర్థయాత్రలకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. 2.5తులాల బంగారు, రూ.18వేల నగదు, రెండు వెండి బ్రాస్‌లేట్లు ఎత్తు కెళ్లారని మస్తానమ్మ చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శవ రాజకీయాలు జగన్‌కు అలవాటే

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం అర్బన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): శవ రాజకీయాలు చేయడం వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అలవాటేనని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. తిరుపతిలో అనుకోకుండా జరిగిన ఘటనలో ఆరుగురు చనిపోవడం చాలా బాధాకరమన్నారు. ఈ ప్రమాద విషయం తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబు హుటాహుటిన తిరుపతికి చేరుకొని, టీటీడీ అధికారులు, పోలీసు యంత్రాంగంపై ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారన్నారు. ఈ ఘటనను రాజకీయం చేసేందుకు జగన్‌తోపాటు వైసీపీ నాయకులంతా ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆరుగురు చనిపోయిన బాధలో ఉంటే జగన్ మందిమార్బలంతో వెళ్లి హడావుడి చేయడం సరికాదన్నారు. తద్వారా ఆస్పత్రిలో బాధితులు ఎంత అసౌకర్యానికి గురయ్యారో తెలుసుకోరా అని మండిపడ్డారు. జిల్లాకు చెందిన వైసీపీ నాయకులు సీఎం చంద్రబాబుపై ఇష్టానుసారం మాట్లాడుతున్నారని, అసలు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో ఏదైనా సంఘటనలు జరిగితే గతంలో జగన్ ఎప్పుడు స్పందించారో ఒకసారి సరిచూసుకోవాలన్నారు.

నగరపాలిక ఇన్‌చార్జి కమిషనర్‌గా మల్లికార్జున రెడ్డి


మల్లికార్జునరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

అనంతపురం క్రైం, జనవరి10(ఆంధ్రజ్యోతి): నగరపాలిక ఇన్‌చార్జి కమిషనర్‌గా మల్లికార్జునరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వాసుపత్రి అడ్మినిస్ట్రేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మల్లికార్జునరెడ్డికి జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఇన్‌చార్జి కమిషనర్ బాధ్యతలు అప్పగించారు. ఇదివరకు ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న రామలింగేశ్వర్ సెలవులోకి వెళ్లడంతో డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(డీఎంఏ)ఆదేశాల మేరకు కలెక్టర్ ఈ ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జునరెడ్డికి డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గొర్రెల సొసైటీ అధ్యక్షుడిగా కదిరప్ప


గొర్రెల సొసైటీకి ఎన్నికైన సభ్యులు

ఆత్మకూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు గొర్రెలు సొసైటీ అధ్యక్షుడిగా చిట్టా కదిరప్పను కమిటీ సభ్యులు శుక్రవారం ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఐదుగురిని సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

శిక్షణపై అవగాహన

అనంతపురం క్రైం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో వడ్రంగుల, ప్లంబింగ్, విద్యుత్ సేవలు, ఉపకరణాల, బ్యూటీషియన్స్‌కు సంబంధించి శిక్షణ ఇచ్చే విషయంపై అవగాహన కల్పించారు. శుక్రవారం నగరపాలిక కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో హోం ట్రైయాంగిల్ ఆఫ్ సమన్వయంతో సర్వీస్ ప్రొవైడర్ ఫేజ్-1 నమోదు కార్యక్రమం నిర్వహించారు. మెప్మా పీడీ విశ్వజ్యోతి మాట్లాడుతూ.. సర్వీస్ ప్రొవైడర్ల కింద నగరంలో ఎవరు ఏ పనులు చేస్తున్నారో వారి వివరాలు నమోదు చేస్తామన్నారు. వారికి ఉచితంగా శిక్షణ అందిస్తామన్నారు. మెప్మా నుంచి వాసుదేవారెడ్డి, భవాని, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏఐయూ కాన్ఫరెన్స్‌కు ఎస్కేయూ వీసీ

అనంతపురం సెంట్రల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వన్ నేషన్-వన్ ఎగ్జామ్ అనే అంశంపై నిర్వహించిన కాన్ఫరెన్స్‌కు ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత వెళ్లారు. శుక్రవారం వేలూరు వీఐటీలో నిర్వహించిన ఆల్ ఇండియా యూనివర్సిటీస్ (ఏఐయూ) సదస్సులో వీసీ పాల్గొన్నారు. టెక్నికల్ సెషన్‌లో పలుఅంశాలపై చర్చించినట్లు ఆమె తెలిపారు.

రెండు టిప్పర్ల సీజ్

శింగనమల, జనవరి 10(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను పోలీసులు సీజ్ చేశారు. గురువారం రాత్రి పెద్దజలాలపురం వంకలో ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను, ఎక్స్‌కవేటర్‌ను స్పెషల్ పార్టీ పోలీసులు సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు..

హిందీభాషతో అపార అవకాశాలు

అనంతపురం సెంట్రల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): హిందీభాష నేర్చుకున్నవారికి అపార అవకాశాలు అందిపుచ్చుకోవచ్చునని కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల హిందీ విభాగాధిపతి రమాదేవి అన్నారు. శుక్రవారం హిందీబాష దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతితిగా వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మిరంగయ్య హాజరై మాట్లాడారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

● మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

అనంతపురం కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. జన విజ్ఞాన వేదిక(జేవీవీ) నగర కమిటీ ఆధ్వర్యంలో బుడ్డప్పనగర్‌లోని రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో అనంతపురం నగరంతోపాటు రూరల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో శుక్రవారం నిర్వహించిన సదస్సుకు గేయానంద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం నిర్వహించే పరీక్షల తర్వాత అంతస్థాయిలో ఎక్కువమంది విద్యార్థులతో పరీక్షలు నిర్వహించేది జేవీవీ అని, ప్రతి సంవత్సరం చెకుముకి సంబరాలు పేరుతో జేవీవీ నిర్వహించే టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షలకు పైగా విద్యార్థులు పాల్గొంటున్నారని, అది ఉపాధ్యాయులందరి సహకారంతోనే సాధ్యమవుతోందన్నారు. జేవీవీ గౌరవాధ్యక్షుడు గాంగేనాయక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, జిల్లా కోశాధికారి జిలాన్‌బాషా, సమత కన్వీనర్ డాక్టర్ పి.ప్రసూన, యూటీఎఫ్ నాయకుడు సురేష్, జేవీవీ నగరాధ్యక్షుడు రామిరెడ్డి, నాయకులు ప్రసాద్, లక్ష్మీనారాయణ, ప్రసాద్‌రెడ్డి, రామకృష్ణ, తిరుపాలు, ముత్యాలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

పశుపోషణ రైతులకు లాభదాయకం

● ఎమ్మెల్యే పరిటాల సునీత


గోకులం షెడ్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి/కనగానపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పాడిపశువుల పోషణ రైతులకు లాభదాయకమని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. శుక్రవారం మండలంలోని పాపిరెడ్డిపల్లి, కనగానపల్లి మండలం ముత్తవకుంట్లలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన గోకులం షెడ్లను ప్రారంభించి అనంతరం నిర్మాణ దశలో ఉన్న వాటిని పరిశీలించారు. రైతులతో గోకులం షెడ్ల నిర్మాణంపై వివరాలు తెలుసుకున్నారు. మండలంలో 56 గోకులం షెడ్లు మంజూరు కాగా ఇప్పటికే 15 పూర్తి చేశామన్నారు. కనగానపల్లి మండలంలో 109 షెడ్లు మంజూరు కాగా 58 పూర్తయినట్లు అధికారులు తెలిపారు. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాడి రైతులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో పెద్ద ఎత్తున గోకులం షెడ్లు మంజూరు చేయించామన్నారు. టెక్నికల్ సాంక్షన్ వచ్చిన వెంటనే జియోట్యాగింగ్ తప్పనిసరిగా చేసి పనులు ప్రారంభించాలని సూచించారు. ఓ రైతు సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించి పంట అనుకున్న మేర దిగుబడి రాలేదని నష్టం వచ్చిందని రైతు వాపోయారు. వ్యవసాయాధికారులతో మాట్లాడి పరిహారం అందేలా చూస్తామన్నారు. నాయకులు రామ్మూర్తినాయుడు, మండల కన్వీనర్ సుధాకర్, పాపిరెడ్డిపల్లి రమేశ్, మాదాపురం శంకర్, పరంధామ యాదవ్ పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికే గోకులం షెడ్లు


ఆత్మకూరులో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

ఆత్మకూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల అభివృద్ధి కోసమే కూటమి ప్రభుత్వం గోకులం షెడ్లు నిర్మించి ఇస్తోందిన టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ముట్లాలలో గోకులం షెడ్‌ను అధికారులు, నాయకులు ప్రారంభించారు. ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఎంపీడీఓ సుజాత, నారాయణస్వామి, శశాంక చౌదరి పాల్గొన్నారు.

అనంతపురంరూరల్: మండలంలోని గ్రామాల్లో అధికారులు పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలను నిర్వహించారు. శుక్రవారం ఉపాధి హామీ నిధుల కింద నూతనంగా నిర్మించిన గోకులం షెడ్లను ప్రారంభించారు. మండలంలో ఆకుతోటపల్లి, మన్నీల, కందుకూరు, పూలకుంట గ్రామాల్లో ఒక్కొక్కటి రూ.2.30లక్షలతో నిర్మించిన పది షెడ్లను ప్రారంభించారు. ఎంపీడీఓ దివాకర్, ఏపీఓ చంద్రకళ, పంచాయతీ కార్యదర్శి అశోక్‌బాబు, మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ పాల్గొన్నారు.

గార్లదిన్నె: ప్రభుత్వం రాయితీతో నిర్మించిన గోకులం షెడ్లు రైతులకు వరమని జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గార్లదిన్నె, ఇల్లూరు, కొప్పలకొండ, కొట్టాలపల్లి తదితర గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చిన్న సన్నకారు రైతులు నిర్మించుకున్న గోకులం షెడ్లను ఆయన ప్రారంభించారు.

శింగనమల: రైతులకు గోకులం షెడ్లు వరంలాంటివని తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య అన్నారు. శుక్రవారం మండలంలో పూర్తయిన 36 గోకులం షెడ్లను తహసీల్దార్, ఎంపీడీఓ నిర్మలకూమారి, ఎంపీపీ యోగేశ్వరి ప్రారంభించారు. ఈఓపీఆర్డీ వెంకటలక్ష్మి, ఏపీఓ శ్రీదేవి, దామోదర్, నాయకులు ఆదినారాయణ, ఎం.ఆదినారాయణ, సత్యనారాయణ, మారుతినాయుడు, రామునాయుడు పాల్గొన్నారు.

రాప్తాడు: రైతులు పాడి పశువుల పెంపకం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన గోకులం షెడ్లు రైతులకు వరమని ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏపీఓ సావిత్రి అన్నారు. మండలంలోని అయ్యవారిపల్లి, బండమీదపల్లి, గాండ్లపర్తి, కొత్తపల్లి. పుల్లలరేవు, యర్రగుంట, రాప్తాడులో 87 గోకులం షెడ్లు ప్రారంభించారు.

నార్పల: మండలంలోని బొందలవాడ గ్రామంలో పశువుల షెడ్డును వైస్‌సర్పంచు ఆలం వెంకటనరసానాయుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతాంగానికి పెద్దపీట వేశారన్నారు. పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు, వెటర్నరీ అసిస్టెంట్ గంగాధర్, రైతు వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురంరూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): అనంతపురం నగరంపాటు పలు మండలాల పరిధిలోని పలు 33కేవీ ఫీడర్లలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆశాఖ డీఈఈ చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అనంతపురం, గుత్తి, పవర్ హౌస్, గార్లదిన్నె, శింగనమల, బుక్కరాయసముద్రం, కల్లూరు 33 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకూడదు: జడ్పీ సీఈఓ


కల్లూరులో సత్యసాయి నీటి సంపును పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ

గార్లదిన్నె, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని డిప్యూటీ సీఈఓ వెంకట సుబ్బయ్యతో కలిసి సీఈఓ సందర్శించారు. కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం కల్లూరు గ్రామంలో సత్యసాయి తాగునీటి సంపును పరిశీలించారు. వారు మాట్లాడుతూ... సత్యసాయి తాగునీటి పైపులైన్ ద్వారా ఎన్ని గ్రామాలకు తాగునీటి సరఫరా అవుతున్నాయని పలు విషయాలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఏపీఓ నాంచారమ్మ, సుంకన్న, వడ్డేవన్నూర్, తిరుమలేసు, నాగేంద్ర పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

టౌన్ బ్యాంక్‌కు పూర్వవైభవం తీసుకొస్తాం: జేసీపీఆర్

తాడిపత్రి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి కో ఆపరేటివ్ టౌన్ బ్యాంక్‌కు పూర్వవైభవం తీసుకొస్తామని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక టౌన్ బ్యాంక్‌లో శుక్రవారం ఆయన బ్యాంక్ డైరెక్టర్లు, సిబ్బంది, ప్రజలతో సమావేశమై మాట్లాడారు. గత ఐదేళ్లల్లో టౌన్ బ్యాంక్ పాలన గాడితప్పిందన్నారు. అప్పట్లో ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాలివ్వడంతో ఎన్‌పీఏ పెరిగిపోయాయని మండిపడ్డారు. ఇష్టానుసారంగా అప్పులు ఇవ్వ డం ఏంటని ప్రశ్నించారు. తీసుకున్న వారు రుణాలు తిరిగి చెల్లించకపోతే మీరు ఇరుక్కుంటారని బ్యాంక్ మేనేజర్, డై రెక్టర్లు, సిబ్బందిపై ఆగ్రహించారు. గతంలో దాదాపు రూ.20 కోట్ల రుణాలు పెండింగ్ ఉండేవని, ఒత్తిడి చేయడంతో దాదాపు రూ.18కోట్లు రికవరీ అయ్యాయని తెలిపారు. ఇప్పటికీ ఒత్తిడి పెంచి మిగతా రుణాలు రికవరీ అయ్యేటట్లు చూడాలని సూచించారు. రెండునెలలలోపు బ్యాంక్‌ను రూపురేఖలు మార్చాలన్నారు. గతంలో రూ.80కోట్ల టర్నోవర్ ఉండేదని, ప్రస్తుతం రూ.35కోట్లు మాత్రమే ఉంటోందని తెలిపారు. పట్టణ ప్రజలు సహాయ సహకారాలు అం దిస్తే బ్యాంక్‌కు పూర్వ వైభవాన్ని తీసుకొస్తానని అన్నారు. సమావేశంలో బ్యాంక్ మేనేజర్ శివలక్ష్మి, డైరెక్టర్లు దద్దం సుబ్బరాయుడు, లక్ష్మిరెడ్డి, నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, కాకర్ల రంగనాథ, మడ్డిపల్లి జనార్దన్‌రెడ్డి, సలాం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పట్టణంలో పర్యటించిన ఎమ్మెల్యే

పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సర్కిల్ నుంచి కర్నాటక బ్యాంక్ వరకు ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా దుకాణాల నిర్వాహకులతో మాట్లాడుతూ వ్యాపారాలు ఎలా ఉన్నాయి. బాగున్నారా అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే మా దృష్టికి తీసుకురావాలని వారికి సూచించారు. ఆయన వెంట నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, సంజీవపురం పవన్, రామ్మోహన్‌రెడ్డి, రామలింగారెడ్డి, గోవర్దన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

రీ సర్వేపై అవగాహన సదస్సులు

శెట్టూరు/కుందుర్పి/పెద్దవడుగూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): శెట్టూరు మండలం లక్ష్మంపల్లిలో శుక్రవారం భూముల రీసర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈనెల 20నుంచి సర్వే నిర్వహిస్తామని, రైతులు తమ భూములకు సంబంధించిన హక్కుపత్రాలతో హాజరై సర్వే సజావుగా జరిగేలా సహకరించాలని తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి సూచించారు. తర్వాత సర్వే ప్రాధాన్యతపై రైతులకు అవగాహన కల్పించి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఆర్ఐ గోవిందరెడ్డి, సర్వేయర్ మున్వర్ బాషా, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కుందుర్పి మండలంలోని కరిగానపల్లిలోనూ భూముల రీ సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నెల 20 నుంచి సర్వే నిర్వహిస్తామని, రై తులు సహకరించాలని తహసీల్దార్ శ్రీనివాసులు కోరారు. తర్వాత సర్వే ప్రాధాన్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్ఐ పోతన్న, వీఆర్వోలు,సర్వేయర్లు, సర్పంచ్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. పెద్దవడుగూరు మండలం దిమ్మగుడిలో జరిగిన అవగాహన సదస్సులో తహసీల్దార్ ఉషారాణి మాట్లాడుతూ.. 20వతేదీ నుంచి పట్టా భూముల సర్వే జరుగుతుందని, రైతులు పట్టా పాసుపుస్తకం, తగిన ఆధారాలు తీసుకొని హాజరుకావాలని కోరారు. సర్పంచు, రీసర్వే డీటీ జయమ్మ, మండల సర్వేయర్ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

కొనకొండ్లలో చోరీ

ఉరవకొండ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని బిల్డింగ్ కాలనీలో నివాసముంటున్న మస్తానమ్మ అనే మహిళ ఇంట్లో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మస్తానమ్మ మూడు రోజుల క్రితం ఇంటికి తాళాలు వేసి తీర్థయాత్రలకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. స్థానికులు సమాచారంతో మస్తానమ్మ కుమారుడు వచ్చి పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 2.5తులాల బంగారు, రూ.18వేల నగదు, రెండు వెండి బ్రాస్‌లేట్లు ఎత్తు కెళ్లారని చెప్పారు. ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనంతపురంరూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): గుత్తితో పాటు పలు మండలాల్లోని 33కేవీ ఫీడర్లలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ చంద్రశేఖర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉద యం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలివ్వాలి

కూడేరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసనకు దిగారు. నాయకుడు మల్లికార్జున మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు చొప్పున అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. తక్షణం ఈ మేరకు చర్యలు చేపట్టాలన్నారు. రీ సర్వే డీటీ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో నాయకులు నారాయణమ్మ, సుల్తాన్, రమణ, రమణప్ప, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల బోటుకు నిప్పు

గుమ్మఘట్ట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రంగసముద్రం చెరువులో మత్స్యకారులు చేపలవేటకు ఉపయోగించే బోటుకు గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి నిప్పు పెట్టారు. ఆరునెలల క్రితం రంగసముద్రం చెరువులోకి నీరు చేరడంతో బీటీపీ మత్స్యశాఖ సహకార సంఘం సభ్యులు చేపపిల్లలు వదిలారు. ప్రస్తుతం అవి పెద్దవి కావడంతో రంగసముద్రం పరిసర ప్రాంతాల ప్రజలు రాత్రి వేళల్లో గుట్టుగా చేపల వేటకు వెళుతున్నారు. మత్స్యశాఖ సహకార సంఘం సభ్యులు చేపలను వేటాడుతున్న వారిని గత వారంరోజులుగా నిఘా వేసి పట్టుకుని హెచ్చరించారు. దీంతో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మత్స్యకారులు ఉపయోగించే బోటుకు నిప్పంటించగా అది కాలిపోయింది. దీనిపై మత్స్యశాఖ సహకార సంఘం సభ్యులు శుక్రవారం మధ్యాహ్నం ఎస్ఐ ఈశ్వరయ్యకు ఫిర్యాదు చేశారు.

13న ముగ్గుల పోటీలు

యాడికి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన మండలకేంద్రంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, మాజీ ఎంపీటీసీ ఆదినారాయణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణం వద్ద పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. విజేతలకు బహుమతులను అందిస్తామని అన్నారు.



గుత్తి మండలం తొండపాడులో ప్రత్యేక అలంకరణలో బొలికొండ రంగనాథ స్వామి



యాడికిలో ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవస్వామి



ప్రత్యేక అలంకరణలో పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి



తాడిపత్రిలోని చింతల వెంకటరమణ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి, ఆయన తల్లి ఉమారెడ్డి

వైకుంఠవాసా.. నమోనమః

- ఘనంగా ముక్కోటి ఏకాదశి
- వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు
- పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: వైకుంఠ ఏకాదశి వేడుకలను శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల వ్యాప్తంగా ఉన్న వైష్ణవాలయాలైన వేంకటేశ్వరస్వామి, చెన్నకేశవస్వామి, లక్ష్మీనరసింహస్వామి, రంగనాథస్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు వైభవంగా జరిపారు. వేకువజామునే అర్చకులు ఆలయాల్లోని స్వామివారి మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఉత్తర ద్వారం గుండా దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు స్వామి దర్శనానికి తెల్లవారుజామునుంచే క్యూలైన్లలో బారులు తీరారు. స్వామిదర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకుని తీర్థ ప్రసాదాలు పొందారు. వైకుంఠవాసా గోవిందా అనే నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. పలు ఆలయాల్లో స్వామి, అమ్మవార్ల కళ్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. తాడిపత్రి పట్టణంలోని చింతల వెంకటరమణ స్వామిని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆయన సతీమణి జేసీ ఉమారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉరవకొండ మండలం పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామిని జిల్లా ప్రత్యేక న్యాయాధికారి శివశంకర్ కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు చేయించారు. రాయదుర్గం పట్టణంలోని ప్రసన్న వెంకటరమణస్వామిని ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూలనాగరాజు దర్శనం చేసుకున్నారు.



పెన్నహోబిలం ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న న్యాయాధికారి శివశంకర్



రాయదుర్గంలో ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు



బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లులో పాండురంగస్వామి దర్శనం కోసం క్యూలో భక్తులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లుటౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకుడు నరసయ్య, సీఐటీయూ పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం మున్సిపల్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో 16రోజుల సమ్మె కాలంలో ఇచ్చిన హామీలకు జీఓను వెంటనే ఇవ్వాలన్నారు. రెగ్యులర్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేసి పదవీ విరమణ వయస్సు 62కు పెంచాలన్నారు. కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలని, 9నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఈపీఎఫ్‌ను కార్మికుల ఖాతాలో జమచేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు జగదీష్, నాయకులు యేసు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. దీక్షలో హనమంతు, గంగాధర్, లింగమూర్తి, వన్నూరప్ప, హరి, నారాయణమ్మ, మరియమ్మ, జ్యోతి కూర్చున్నారు.

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మోకాళ్లపై నిలబడి వినూత్న నిరసన తెలిపారు. మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రాజా, కార్యదర్శి రవిశంకర్, ఉపాధ్యక్షుడు మురళి, రాజ్‌కుమార్, పారిశుధ్య కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సూర్యనారాయణ, మహేష్, రామాంజనేయులు, సుంకన్న పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు, సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా సహాయ కా ర్యదర్శి ప్రసాద్, మున్సిపల్ వర్కర్లు, యూనియన్ అధ్యక్షుడు శివ, నాయకులు తిమ్మ ప్ప, వెంకటేష్, రమణ, శివకుమార్, నటరాజ్, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: పట్టణంలోని ఇంజనీరింగ్ కార్మికులు, సీఐటీయూ నాయకులు పాత మున్సిపల్ కార్యాలయం నుంచి కొత్త మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ నిరాహారదీక్ష చేపట్టారు. దీక్షకు పారిశుధ్య కార్మికుల యూనియన్ నాయకులు మల్లేష్, స్వామి, శీన, బొజ్జప్ప మద్దతు తెలిపారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, కార్మికులు తిప్పేరుద్ర, రియాజ్, ఇస్మాయిల్, మైలారి, నరసింహులు, పాలయ్య, సిద్ధలింగ తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

పామిడి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ తేజోత్స్న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. కోరం లేకపోవడంతో సమావేశం దాదాపు గంట ఆలస్యంగా మొదలైంది. తర్వాత మండలస్థాయి అధికారులు తమ శాఖా పరమైన సమాచారాన్ని ప్రజాప్రతినిధులకు తెలియజేశారు. ప్రజాప్రతినిధులు సైతం నామమాత్రంగా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ శ్రీధరమూర్తి, ఎంపీపీ మురళీమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కాయల మహేష్, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

తెగుళ్ల దెబ్బకు చేతికందని వేరుశనగ

- గొర్రెలకు మేతగా వదిలేసిన వైనం

శెట్టూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తెగుళ్లదెబ్బకు చేతికి అందకుండా పోయిన వేరుశనగ పంటను గొర్రెలకు మేతగా వదిలేశాడు ఓ రైతు. మండలంలోని అనుంపల్లిలో రైతు పెంటాల ఈరన్న రెండు ఎకరాల్లో వేరుశనగ సాగుచేశారు. అయితే పంటకు అగ్గి తెగులు, మచ్చ తెగులు సోకింది. కాగా అతను తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోలేక గొర్రెలకు మేతగా వదిలేశారు. సుమారు రూ. 50 వేలు పెట్టుబడి పెట్టి పంట సాగు చేస్తే.. తెగుళ్ల బారిన పడి చేతికందకుండా పోయిందని, దీంతో చేసేదిలేక గొర్రెలకు మేతగా వదిలేశామని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పంటల్లో తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారులు సలహాలు, సూచనలు తెలియజేయడంతో పాటు సబ్సిడీతో పురుగుమందులు అందించాలని మండల రైతులు కోరుతున్నారు.



అనుంపల్లిలో వేరుశనగ పొలంలో మేస్తున్న గొర్రెలు

ఘనంగా ముందస్తు సంక్రాంతి

గుంతకల్లుటౌన్/ కూడేరు/ కళ్యాణదుర్గం రూరల్/ ఉరవకొండ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్నారు. రంగు రంగుల ముగ్గులు వేసి అందులో గొబ్బెమ్మలను ఉంచి పూజలు చేశారు. అలాగే భోగి మంటలు వేశారు. ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, వైస్‌ప్రిన్సిపాల్ ఓబులేసు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే కూడేరు మండలకేంద్రంలోని సంగమేశ్వర శ్రీవాణీ స్కూల్లో సంక్రాంతి సంబరాలను జరిపారు. సీఐ రాజు పాల్గొని భోగి మంటలు వేశారు. కరెస్పాండెంట్ శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇక కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ సంక్రాంతి వేడుకలు జరిగాయి. ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీధర్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ , అధ్యాపకులు విద్యార్థులు ఉపాధ్యాయులు ఉల్లాసంగా పాల్గొన్నారు.



కూడేరు శ్రీవాణీ స్కూల్లో సంక్రాంతి వేడుకలో పాల్గొన్న సీఐ రాజు



గుంతకల్లులోని ఎస్కేపీ డిగ్రీ కాలేజీలో భోగి మంట వేసిన అధ్యాపకులు, విద్యార్థులు



కళ్యాణదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ..

ఉద్యోగాలకు 28 మంది ఎంపిక

రాయదుర్గంరూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళా లో 28 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి తెలిపారు. రాష్ట్రనైపుణ్యాభివృద్ధి సీడప్ సంస్థ చైర్మన్ దీపక్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాలో అమెజాన్, హర్యాజన్ ఫైనాన్స్, హుండయ్ ముబీస్, టీకన్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. 52 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేసి 28మందిని ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, డీఆర్‌డీఏ సీడప్ డీపీట్రైనర్ నారాయణస్వామి, ఏపీఎ న్‌డీసీ కో ఆర్డినేటర్ వనిత తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

బొమ్మనహాళ్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొళగానహళ్లి గ్రామ శివారులో పశుగ్రాసం దగ్ధమైంది. ఈ ఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కావలి రామరాజు 10 ఎకరాల్లోని పశుగ్రాసాన్ని గ్రామ సమీపంలో వాము వేశాడు. కాగా గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం వల్ల గ్రాసం దగ్ధమైంది. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అదుపులోకి రాకపోవడంతో మొత్తం కాలిపోయింది. అధికారులు బాధిత రైతుకు న్యాయం చేయాలని గ్రామస్థులు కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగివైరు చోరీ

రాయదుర్గంరూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని 74 ఉడేగోళంలో సమీపంలో చెరువు వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఊడదీసి అందులోని రాగివైరును ఎత్తుకెళ్లినట్లు ట్రాన్స్‌కో ఏఈ బాలచంద్ర తెలిపారు. స్థానికులు శుక్రవారం ఉదయం గమనించి తమకు సమాచారం ఇచ్చారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

జీఎస్‌బీసీపై రక్షణ గోడ నిర్మాణం



జీఎస్‌బీసీపై నిర్మించిన రక్షణ గోడ

ఆంధ్రజ్యోతి స్పందన

గుంతకల్లు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని ఆలూరు రోడ్డుపై గుత్తి సబ్ బ్రాంచ్ కాలువ (జీఎస్‌బీసీ)పై ఆర్అండ్‌బీ అధికారులు రక్షణ గోడను నిర్మించారు. జీఎస్‌బీసీపై ఉన్న ఆర్అండ్‌బీ రహదారి రక్షణ గోడ కూలిపోయి ప్రమాదకర పరిస్థితులు ఉండటంతో సమస్యను వివరిస్తూ గత నెలలో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకుని రక్షణ గోడను నిర్మించారు. దీనిపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కూటమి ప్రభుత్వంలో పశుపోషణకు పెద్దపీట

- గోకులం షెడ్ల ప్రారంభంలో ఎమ్మెల్యే అమిలినేని



కంబదూరు మండలం కదిరిదేవరపల్లిలో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో పశుపోషణ భారమైందని, కానీ ప్రస్తుతం కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పశుపోషణకు పెద్దపీట వేశామని ఎమ్మె ల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. కంబదూరు మండలం కదిరిదేవరపల్లిలో ఉపాధిహామీ కింద నిర్మించిన గోకులం షెడ్లను శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పాడి పశువులు, గొర్రెలు, మేకల పెం పకందారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, వారు ఆర్థికంగా బలపడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ గోకులం షెడ్లను ప్రవేశ పెట్టిందన్నారు. అర్హత వున్న ప్రతి ఒక్కరికీ గోకులం షెడ్లను మంజూరు చేస్తామని తెలిపారు. కూటమి వచ్చిన తరువాత ఉచిత ఇసుక ప్రవేశపెడితే కొందరు సర్పంచ్‌లు డబ్బులు వసూలు చేస్తున్నారని, వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. తర్వాత కంబదూరులోని మల్లేశ్వర స్వామి దర్శించుకుని ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే నాటారు. టీడీపీ సీనియర్ నాయకులు, ఆయా శాఖల అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోకులం షెడ్లను ప్రారంభించిన అధికారులు

శెట్టూరు : మండలంలోని అయ్యగార్లపల్లిలో నూతనంగా నిర్మించిన మినీ గోకులం షెడ్డును ఎంపీడీఓ రఘురామారావు ప్రారంభించారు. ఉపాధిహామీ ఇన్‌చార్జి ఏపీఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండకేంద్రంతో పాటు ఆవులెన్న, ఎర్రగుడి, అంకంపల్లి గ్రామాల్లో గోకులం షెడ్లను ఎంపీడీవో లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఏపీవో సూర్యప్రకాష్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, సర్పంచ్ రాము, నాయకులు పాల్గొన్నారు.

కుందుర్పి: మండల కేంద్రంతో పాటు అపిలేపల్లి, తూముకుంట తదితర గ్రామాల్లో నిర్మించిన 15 మినీగోకులం షెడ్లను ఇన్‌చార్జి ఏపీవో రవీంద్ర, టీడీపీ మండల కన్వీనర్ ధనుంజయ తదితరులు ప్రారంభించారు. ఎంపీడీవో లక్ష్మీశంకర్, సాగునీటి సంఘం ప్రెసిడెంట్ రామమూర్తి, పలువురు టీడీపీ నాయకులు నాయకులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలకేంద్రంతో పాటు అప్పేచర్ల, రావులుడికి, మల్లేపల్లి గ్రామాల్లో గోకులం షెడ్లను ఎంపీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మీనారాయణ, టీడీపీ సీనియర్ నాయకుడు గంగరాజుయాదవ్ ప్రారంభించారు. ఎంపీడీఓ నరసింహారెడ్డి, ఏపీఓ పుల్లారెడ్డి, మాజీ సర్పంచ్ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: మండలంలోని బీఎన్‌హళ్లి, కెంచానపల్లి, ఆవులదట్ల తదితర గ్రామాలలో నిర్మాణం పూర్తయిన 25 గోకులం షెడ్లను ప్రారంభించినట్లు ఎంపీడీఓ కొండన్న తెలిపారు. ఈఓపీఆర్డీ మురళీకృష్ణ, ఈసీ భారతి, టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు, నాయకులు పాల్గొన్నారు.

కణేకల్లు: మండలంలోని తుంబిగనూరు, జక్కలవడికి, గెణిగెర తదితర గ్రామాలలో 30 మినీ గోకులం షెడ్లు ప్రారంభించినట్లు ఏపీఓ సుధాకర్ తెలిపారు. ఆయా గ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కూడేరు: మండలంలోని చోళసముద్రం, జల్లిపల్లి, జయపురం, ఉదిరిపికొండ, మరుట్ల గ్రామాల్లో గోకులం షెడ్లను ఎంపీడీఓ కుళ్లాయిస్వామి ప్రారంభించారు. ఏపీఓ తులసీప్రసాద్, రైతు కేశన్న, సర్పంచు వడ్డే రమాదేవి, టీడీపీ నాయకులు, ఉపాధిసిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండ: వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్ద తండాలో మినీ గోకులం షెడ్‌ను టీడీపీ మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు, అధికారులు ప్రారంభించారు. అలాగే ఉరవకొండ పట్టణంతో పాటు చిన్నముష్టూరు గ్రామంలో గోకులం షెడ్లను ఎంపీడీఓ రవిప్రసాద్, ఏపీవో విమల, టీడీపీ నాయకులు ప్రారంభించారు.

ఘనంగా వివేకానందుడి జయంతి

ఉరవకొండ,జనవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆయూర్ సంస్థ ఆధ్వర్యంలో స్వామి వివేకనందుడి జయంతిని నిర్వహించారు. గవిమఠం ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి హాజరై చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. తర్వాత విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వివేకానందుడి వేషధారణలో చిన్నారులు అలరించారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ, వైస్‌ప్రిన్సిపాల్ మస్తానయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

సర్వేయర్‌కు ఆర్థిక సాయం

యాడికి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో గాయపడిన మండల సర్వేయర్ సుంకన్నకు చికిత్స కోసం రూ.50వేలు అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సర్వేయర్ సుంకన్న సోదరుడికి తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు నగదును అందజేశారు. సుంకన్న గుత్తిలో నివాసం ఉంటున్నారు. ఆయన ఈనెల 1వ తేదీన బైక్‌లో అనంతపురం వెళ్లి తిరిగి వస్తూ గుత్తి వద్ద రోడ్డుప్రమాదంలో గాయపడి అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆర్థిక సాయం అందజేశారు.